RNI No. APTEL/2009/28868

# సిటిజన్ టైమ్స్

ప్రజా సమస్యలపై పోరాటమే మా లక్ష్యం

తెలుగు దినపత్రిక

CITIZEN TIMES TELUGU DAILY

VOLUME: 17 | ISSUE: 261 | EDITOR: KANCHERLA SANDEEP KUMAR | VISAKHAPATNAM 16-4-2026 | Pages: 8 | R2/-

సంపుటి : 17 | సంచిక : 261 | ఎడిటర్ : కంచర్ల సందీప్ కుమార్ | విశాఖపట్నం 16-4-2026 | పేజీలు : 8 | రూ2/-



# నీటి భద్రత కోసం 'జలధార' యాక్షన్ ప్లాన్

## సీఎం చంద్రబాబు ఆదేశాలు

ప్రాజెక్టులపై సీఎం చంద్రబాబు సమీక్ష

పోలవరం ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని సూచన

జూన్ చివరి నాటికి వెలిగొండ మొదటి దశ పనులు పూర్తి చేయాలని లక్ష్యం

నేరడి బ్యారేజ్, చింతలపూడి కెనాల్‌కు త్వరలో టెండర్లు

రాష్ట్రంలో పెరిగిన భూగర్భ జలాలు.. లిఫ్ట్ ఇరిగేషన్ పథకాల పునరుద్ధరణకు చర్యలు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

రాష్ట్రంలో నీటి భద్రతకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, పోలవరం ప్రాజెక్టు పూర్తయ్యాక గోదావరి జలాలను ఎలా వినియోగించుకోవాలో స్పష్టమైన 'జలధార యాక్షన్ ప్లాన్' సిద్ధం చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను ఆదేశించారు. కుడి, ఎడమ కాలువలకు అనుసంధానంగా ఉన్న రిజర్వాయర్లు, చెరువులను నింపేలా ప్రణాళిక రూపొందించాలని సూచించారు. బుధవారం తన క్యాంపు కార్యాలయంలో

తరువాయి 2లో..






విద్యాశాఖ మంత్రిగా...

నారా లోకేశ్ కృషికి దక్కిన ఇంటర్ 'ఫలితం'

ప్రభుత్వ కళాశాలల్లో పెరిగిన ఉత్తీర్ణత

12 ఏళ్ల తరువాత మొదటి సంవత్సరం

77 శాతం ఉత్తీర్ణతతో సరికొత్త రికార్డు

ప్రభుత్వ కాలేజీల్లో ఫస్టియర్ గతేడాది కంటే

8 శాతం పెరిగి 66 శాతం ఉత్తీర్ణత నమోదు

ఇంటర్ విద్యార్థులకూ మధ్యాహ్నభోజనం,

సర్వేపల్లి రాధాకృష్ణ కిట్లు పంపిణీ

విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ ప్రణాళిక,

పర్యవేక్షణతో ఉత్తమ ఫలితాలు

**అమరావతి, సిటిజన్ టైమ్స్**

విద్యాశాఖ సాధించిన విజయాల కంటే వివాదాలే ఎక్కువ అని పేరుపడింది. విద్యాశాఖ ఎవరు తీసుకున్నా సవాల్ స్వీకరించినట్టే. కష్టం అంటే ఇష్టంగా భావించి, కష్టాలను నేర్పు-ఓర్పుతో అధిగమించే చాలెంజ్ కింగ్ నారా లోకేశ్ విద్యాశాఖను చేపట్టి అతిపెద్ద సవాల్‌ను స్వీకరించారు. విద్యావ్యవస్థలో వేళ్లూనుకున్న సమస్యలను పరిష్కరించారు. సంస్కరణలకు నాంది పలికారు. ప్రణాళికాబద్ధంగా విద్యావ్యవస్థను గాడిలో పెట్టారు. కష్టానికి తగ్గ ప్రతిఫలం ఇంటర్ ఫలితాల రూపంలో కనిపించే సరికి విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ మోములో విజయదరహాసం మెరిసింది.

**మంత్రి కృషితో 12 ఏళ్ల తరువాత**

ఈ ఏడాది ఇంటర్మీడియట్ ఫలితాలు 12 ఏళ్లలో ఎన్నడూ లేని విధంగా ఈసారి అత్యుత్తమ ఫలితాలు వచ్చాయి. విద్యా సంవత్సరంలో ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విద్యాశాఖా మంత్రి నారా లోకేశ్ చేపట్టిన సంస్కరణలు, అమలుచేసిన ప్రణాళికల వల్లే మెరుగైన ఫలితాలు వచ్చాయని విద్యావేత్తలు విశ్లేషిస్తున్నారు.

**ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు**

మొదటి సంవత్సరం 77% ఉత్తీర్ణత. ఇది గత 12 ఏళ్లలో అత్యధికం. రెండవ సంవత్సరం 81% ఉత్తీర్ణత. ఇది

తరువాయి 2లో..




**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**

రెండో ప్రపంచ యుద్ధం తర్వాత విజయగర్వంతో ఈజిప్ట్‌లోని సూయజ్ కెనాల్ విషయంలో బ్రిటన్ చేసిన ఓ తప్పు.. దాని సూపర్‌పవర్ హోదాను ఒక్కసారిగా కూల్చింది. ప్రపంచానికి నాయకుడు ఎవరో మరోసారి గుర్తుచేయాలనుకొన్న దాని ప్రయత్నం వికటించింది. అంతేకాదు.. అప్పటివరకు అండగా ఉన్న అమెరికా వంటి బలమైన మిత్రులు కూడా నాడు దూరం జరిగారు. అక్కడితో ఆగకుండా అసలు బ్రిటన్ ఆర్థికంగా ఎంత డొల్లగా ఉందో అమెరికా ప్రపంచానికి చూపింది. నాడు ఇజ్రాయెల్ కూడా బ్రిటన్‌తో కలిసింది. తాజాగా హార్మూజ్ విషయంలో అమెరికా అటువంటి తప్పే చేస్తోందనిపిస్తోంది. ప్రపంచ వ్యాప్తంగా దాని పరపతి పడిపోతోంది. నేడు కూడా ఇజ్రాయెలే అమెరికాతో కలిసి హార్మూజ్ వద్ద పని చేస్తోంది.

**'సూయజ్' జాతీయంతో ఐరోపా సూపర్‌పవర్లకు కంటగింపు..:** 1869లో సూయజ్ కాల్వ అందుబాటులోకి వచ్చిన నాటి నుంచి దీనిని 'ది సూయజ్ కెనాల్ కంపెనీ' నిర్వహిస్తోంది. దీనిలో తొలుత ఈజిప్ట్-ఫ్రాన్స్ వాటాలు ఉండేవి. కానీ, 1875లో అప్పుల కారణంగా ఈజిప్ట్ ఈ వాటాలను బ్రిటన్‌కు విక్రయించి యాజమాన్యం నుంచి వైదొలగింది. 1951లో ఆంగ్లో-ఈజిప్షియన్ ట్రీటీ (1936)ని కైరో రద్దు చేసుకొంది. దీంతో ఈజిప్ట్ వద్ద బ్రిటన్

తరువాయి 2లో..

# నాపై నమ్మకంతో మరోసారి పదవి అప్పగించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

టీడీపీ ఏపీ అధ్యక్షుడిగా రెండోసారి పల్లా శ్రీనివాసరావు నియామకం

సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపిన పల్లా

జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా లోకేశ్ నియామకాన్ని స్వాగతించిన వైనం

సామాన్య కార్యకర్తలకూ పెద్దపీట వేసే పార్టీ టీడీపీ అని వ్యాఖ్య

కొత్తగా నియమితులైన జాతీయ, రాష్ట్ర కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు



**అమరావతి, సిటిజన్ టైమ్స్**

తెలుగుదేశం పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షుడిగా పల్లా శ్రీనివాసరావు మరోసారి నియమితుడయ్యారు. తనపై నమ్మకంతో రెండోసారి

తరువాయి 2లో..

### కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు..

# పవన్ కీలక ఆదేశాలు



2027లో వచ్చే గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దిశానిర్దేశం

10 కోట్ల మంది భక్తులు వస్తారని అంచనా

ఘాట్ల ఆధునీకరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయన్న మంత్రి దుర్గేశ్


**అమరావతి, సిటిజన్ టైమ్స్**

2027లో జరగనున్న గోదావరి పుష్కరాలను అత్యంత ప్రతిష్ఠాత్మకంగా, భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా నిర్వహించాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశించినట్లు ఏపీ పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేశ్

తరువాయి 2లో..

# ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి: మోదీ

**న్యూస్ డెస్క్, సిటిజన్ టైమ్స్**



ప్రధాని నరేంద్ర మోదీ కర్ణాటకలోని ఆదిచుంచనగిరి మఠాన్ని సందర్శించారు. అక్కడ ఏర్పాటు చేసిన సభలో ప్రధాని ప్రసంగించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి 9 పనుల గురించి మోదీ హామీ తీసుకున్నారు. "మీ నుంచి నాకు తొమ్మిది హామీలు కావాలి. వికసిత్ కర్ణాటక కోసం మీరంతా నాకు వాటిపై ప్రమాణం చేయండి. ఈ ప్రమాణాలను

తరువాయి 2లో..

# చంద్రగిరిలో నారా రామ్మూర్తినాయుడు స్పోర్ట్స్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్

చంద్రగిరిలో క్రీడా సంబరం

సీఎం చదివిన బడిలో క్రీడా వికాస కేంద్రం

రూ.3.17 కోట్లతో క్రీడా కేంద్రం

మంత్రి లోకేశ్ చేతుల మీదుగా ప్రారంభం

పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్‌తో కలిసి

బ్యాడ్మింటన్ ఆడిన లోకేశ్

**తిరుపతి, సిటిజన్ టైమ్స్**



తిరుపతి జిల్లా చంద్రగిరిలో క్రీడా సంబరం నెలకొంది. ముఖ్యమంత్రి చంద్రబాబు సోదరుడు, దివంగత నారా రామ్మూర్తినాయుడు స్మారకార్థం నిర్మించిన క్రీడా వికాస కేంద్రాన్ని రాష్ట్ర ఐటీ, విద్య శాఖల మంత్రి నారా లోకేశ్ బుధవారం ఘనంగా ప్రారంభించారు. చంద్రగిరి ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఈ కేంద్రాన్ని ప్రారంభించిన లోకేశ్... ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్‌తో కలిసి కాసేపు బ్యాడ్మింటన్ ఆడి సందడి చేశారు. కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి లోకేశ్ కు హాకీ క్రీడాకారులు

తరువాయి 2లో..

## ఎడిటోరియల్

# పల్లె వైపు జనసేన చూపు

ఏ రాజకీయ పార్టీకి అయినా మంచి బేస్ ఉండాలి అంటే గ్రామాలలో పట్టు ఉండాలి. తెలుగుదేశం ఇన్నేళ్ళ పాటు కొనసాగినా వైసీపీ అధికారంలోకి వచ్చిన పల్లెలలో ఆదరణ అతి ముఖ్య కారణం అన్నది తెలిసిందే. జనసేన ఏపీలో మూడవ రాజకీయ పార్టీగా కొనసాగుతోంది. అయితే రెండు పెద్ద పార్టీల మధ్య తనకంటూ స్పేస్ ని పెంచుకునే ప్రయత్నంలో ఆ పార్టీ ఉంది. 2024 లో కూటమి ప్రభుత్వంలో భాగస్వామ్యం అయి అధికారంలో వాటా సాధించిన తరువాత జనసేన పార్టీ పటిష్టత కోసం గట్టి ప్రయత్నాలే చేస్తోంది. గ్రామీణ ప్రాంతాలలో టీడీపీ అయితే బూత్ లెవెల్ వరకూ ఉంది క్షేత్ర స్థాయిలో ఆ పార్టీ స్ట్రాంగ్ గా ఉంది. వైసీపీకి మొదటి నుంచి పల్లెలలోనే జనాదరణ ఉంది. జగన్ కి మాస్ ఫాలోయింగ్ ఉంది కాబట్టి పల్లెలను ఆ పార్టీ ఆకట్టుకుంది. జనసేన అధినేత పవన్ కళ్యాణ్ సినీ గ్లామర్ నిండుగా కలిగిన వారు. అయితే రాజకీయంగా చూస్తే జనసేన ఇంకా విస్తరించాల్సి ఉంది ఆ పార్టీకి అభిమానులే ఈ రోజుకీ సైన్యంగా ఉన్నారు. వారితో పాటుగా జనం నుంచి ఇంకా పెద్ద ఎత్తున పార్టీ సానుభూతిపరులను తీసుకుని జనసేనను బలోపేతం చేసుకోవాలని అధినాయకత్వం భావిస్తోంది. దాంతోనే ఉద్యమి పేరుతో సభ్యత్వ నమోదుని ఈ మధ్యన ప్రారంభించింది. సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని కూడా పార్టీ గడువు పెంచుకుంటూ వెళ్ళడం వెనక రూరల్ వైపు దృష్టి పెట్టడం అన్న కాన్సెప్ట్ ఉందని అంటున్నారు. రూరల్ లోనే ఎక్కువగా సభ్యత్వ నమోదు చేయించాలని చూస్తున్నారు. ఆ దిశగా పార్టీ విజయవంతమైన వ్యూహాలను కూడా రచిస్తోంది. ఇక స్థానిక సంస్థల ఎన్నికలను కూడా జనసేన ఒక చాలెంజ్ గా తీసుకుంటోంది. ఈసారి మండలాలు, పంచాయతీల మీద ఎక్కువ దృష్టి పెట్టాలని చూస్తోంది. అక్కడ కనుక గెలుచుకుంటే రానున్న రోజులల్లో పార్టీ పునాదులు గట్టి పడతాయని ఫలితంగా కొత్తగా పెరిగే అసెంబ్లీ సీట్లలో కూడా తమ పార్టీ ప్రాతినిధ్యాన్ని పెంచుకోవచ్చు అని ఆలోచన చేస్తోంది. ఇక పవన్ కూడా పంచాయతీ రాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలను తీసుకున్నారు. ఆ విధంగా కూటమి ప్రభుత్వం ద్వారా పవన్ చేసే మంచిని వివరించడం ద్వారా పల్లె పట్టులో తమ పట్టును ఎక్కువగా చేసుకోవాలని జనసేన చూస్తోంది. పది కాలాల పాటు పార్టీ నిలిచి గెలిచి ఉండాలంటే గ్రామీణం పైనే ఆలోచనలు చేయాలని జనసేన వ్యూహకర్తలు భావిస్తున్నారు. అయితే జనసేన పల్లె వైపు పెడుతున్న ఫోకస్ తో ఏ పార్టీకి దెబ్బ అన్న చర్చ సాగుతోంది. వైసీపీ విపక్షంలో ఉంది కాబట్టి ఆ పార్టీ నుంచే వాటా తీసుకుని బలపడాలని జనసేన వంటి పార్టీలు చూడడం సహజం. అదే సమయంలో వైసీపీకి కూడా స్ట్రాంగ్ హోల్డ్ రూరల్ లో ఉంది. ఇప్పటికి పదిహేనేళ్ళుగా అది కొనసాగుతోంది. మరి అటు నుంచి ఇటు మార్పు ఉంటుందా లేక ఏ వైపు నుంచి జనసేన విస్తరణకు అవకాశం ఉంది అన్నదే కీలక చర్చగా ఉంది.

# ఏపీ ఇంటర్ ఫలితాలు వచ్చేశాయ్..

గత 12 ఏళ్లలో రెండవ అత్యుత్తమ ఫలితం.

**ప్రభుత్వ నిర్వహణలోని విద్యాసంస్థల్లో..**

మొదటి సంవత్సరం 66% ఉత్తీర్ణతతో గత 12 ఏళ్లలోనే రికార్డు సృష్టించాయి.

రెండవ సంవత్సరం 76% ఉత్తీర్ణతతో గత 12 ఏళ్లలో రెండవ ఉత్తమ ఫలితాలు నమోదయ్యాయి.

**సంక్షేమం-సంస్కరణలు**

ఇప్పటివరకూ హైస్కూలు విద్యార్థులకే అమలవుతున్న డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంను ఇంటర్ విద్యార్థులకూ అమలు చేశారు. సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర పథకం కింద విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్కులు, పోటీ పరీక్షల మెటీరియల్, సైన్స్ ప్రాక్టికల్ రికార్డులు/మాన్యువల్స్‌ను పంపిణీ చేశారు. ఖాళీగా ఉన్న ప్రిన్సిపాల్ పోస్టులను అర్హులైన జూనియర్ లెక్చరర్లకు పదోన్నతులతో భర్తీ చేశారు. బోధనా సబ్జెక్టుల్లో ఖాళీగా ఉన్న అన్ని పోస్టులను గెస్ట్ ఫ్యాకల్టీతో భర్తీ చేసి, బోధనకు అంతరాయం లేకుండా చూశారు.

ప్రణాళిక- పర్యవేక్షణ

జూనియర్ కాలేజీ విద్యార్థులకు పకడ్బందీగా యూనిట్ టెస్టులు, క్వార్టర్లీ, హాఫ్ ఇయర్లీ, ప్రీ-ఫైనల్ పరీక్షలను కేంద్రీకృత పద్ధతిలో నిర్వహించారు. పరీక్షా ఫలితాలను డ్యాష్‌బోర్డ్‌ల ద్వారా నిరంతరం పర్యవేక్షిస్తూ, విద్యార్థుల మార్కుల ఆధారంగా టీచర్ల పనితీరును ప్రతి నెలా సమీక్షించారు.

**'సంకల్పం-2026' (50 రోజుల విజయ ప్రణాళిక)**

విద్యార్థుల సామర్థ్యాన్ని బట్టి వారిని ఎ, బి, సి కేటగిరీలుగా విభజించి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. విద్యార్థులు ఏ సబ్జెక్టుల్లో ఇంకా మెరుగు కావాలో గుర్తించి ఆ దిశగా శిక్షణ అందించారు. వెనుకబడిన విద్యార్థుల కోసం ప్రత్యేక స్టడీ మెటీరియల్‌ను రూపొందించి పంపిణీ చేశారు.

**తీసుకున్న చర్యలు**

- కేర్ టేకర్ వ్యవస్థ ద్వారా ప్రతి జూనియర్ లెక్చరర్ కనీసం 10 మంది విద్యార్థులను దత్తత తీసుకుని, వారి హాజరు, ఫలితాల బాధ్యతను స్వీకరించారు.
- విద్యార్థుల సంక్షేమం చూస్తూనే ఇందులో తల్లిదండ్రుల భాగస్వామ్యం పెంపొందించారు.
- జూనియర్ కాలేజీల్లో ఏడాదికి రెండుసార్లు మెగా పేరెంట్ టీచర్ మీటింగులు నిర్వహించి పిల్లల ప్రగతిని వివరించే ప్రోగ్రెస్ కార్డులను అందజేశారు.
- డిజిటల్ కనెక్టివిటీతో సత్ఫలితాలు సాధించారు. సిలబస్ పురోగతిని తల్లిదండ్రులకు తెలియజేయడానికి క్లాస్ వారీగా వాట్సాప్ గ్రూపులను ఏర్పాటు చేశారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు కొత్త ప్రశ్నపత్రం విధానం ప్రవేశపెట్టడం వల్ల, వారు అన్ని సబ్జెక్టులలో అత్యధిక స్కోరు సాధించడానికి మంచి అవకాశం ఏర్పడింది. విద్యాశాఖ మంత్రిగా నారా లోకేశ్ పట్టుదల, కృషితో ఇంటర్ మీడియట్‌లో మెరుగైన ఫలితాలు వచ్చాయి. క్షేత్రస్థాయి నుంచి వచ్చిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా అధికారులు, నిపుణుల సూచనలు-సలహాలతో రూపొందించిన ప్రణాళిక పకడ్బందీగా అమలు చేసిన మంత్రి నారా లోకేశ్ నిరంతరం పర్యవేక్షించారు. లక్ష్యానికి చేరుకున్నారు. ఇంటర్‌లో మెరుగైన ఫలితాలు సాధించారు.

# నీటి భద్రత కోసం 'జలధార' యాక్షన్ ప్లాన్

జలవనరుల శాఖపై ఆయన సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. పోలవరం, వెలిగొండ, హంద్రీనీవా సహా పలు కీలక ప్రాజెక్టుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. పోలవరం ప్రాజెక్టును ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని, హోటళ్లు, షాపింగ్ ఏరియాలతో పాటు పోలవరం-పాపికొండలు-భద్రాచలం మార్గంలో బోటింగ్ సౌకర్యం కల్పించాలని సీఎం సూచించారు. గోదావరి పుష్కరాల నాటికి ప్రాజెక్టును ప్రారంభించేలా పనులు వేగవంతం చేయాలన్నారు. ప్రాజెక్టులో కీలకమైన ఈసీఆర్ఎఫ్ డ్యామ్ గ్యాప్ 1, 2 పనులను వచ్చే ఏడాది మార్చి నాటికి పూర్తి చేయాలని నిర్దేశించారు. పునరావాస పనులను వేగవంతం చేసి, నిర్వాసితుల తరలింపును నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని స్పష్టం చేశారు. ఇప్పటివరకు ప్రాజెక్టుకు రూ.27,089 కోట్లు ఖర్చు కాగా, మిగిలిన పనులకు మరో రూ.5,108 కోట్లు అవసరమని అధికారులు వివరించారు. రాయలసీమ, ప్రకాశం జిల్లాలకు జీవనాడి అయిన వెలిగొండ ప్రాజెక్టు స్టేజ్-1 పనులను జూన్ నెలాఖరు నాటికి పూర్తి చేయాలని సీఎం లక్ష్యంగా నిర్దేశించారు. హంద్రీనీవా ద్వారా ఇప్పటివరకు 52 టీఎంసీల నీటిని రాయలసీమకు తరలించినట్లు అధికారులు తెలిపారు. ఉత్తరాంధ్ర ప్రాజెక్టుల పనులు వేగవంతం చేయాలని, వంశధార నదిపై ప్రతిష్ఠాత్మకమైన నేరడి బ్యారేజ్‌కు అడ్డంకులు తొలగినందున వెంటనే టెండర్లు పిలవాలని ఆదేశించారు. చింతలపూడి ఎత్తిపోతల పథకం, వరికెపుడిశెల ప్రాజెక్టు పనులనూ ముందుకు తీసుకెళ్లాలన్నారు. పోలవరం-నల్లమల సాగర్ అనుసంధానానికి సంబంధించిన డీపీఆర్‌కు త్వరగా ఆమోదం పొందేలా చూడాలని సూచించార. రాష్ట్రంలో చేపట్టిన జల సంరక్షణ చర్యల వల్ల భూగర్భ జలాలు గణనీయంగా పెరిగాయని అధికారులు సీఎంకు తెలిపారు. గతేడాది ఏప్రిల్‌తో పోలిస్తే ఈ ఏడాది 0.79 మీటర్ల మేర భూగర్భ జలాలు పెరిగాయని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో నిర్లక్ష్యానికి గురై నిర్వీర్యమైన లిఫ్ట్ ఇరిగేషన్ పథకాలను పునరుద్ధరించేందుకు త్వరగా టెండర్లు పిలవాలని చంద్రబాబు ఆదేశించారు. ఈ సమీక్షలో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సాయి ప్రసాద్, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## సూయజ్ సీను..

# హర్మూజ్ వద్ద రిపీటవుతోందా..?

సైనిక స్థావరం ఖాళీ చేయాల్సిన పరిస్థితి నెలకొంది. నాటి నుంచే బ్రిటన్-ఫ్రాన్స్ గుర్రుగా ఉన్నాయి. 1952 తిరుగుబాటుతో ఈజిప్టులో పాలకులు మారారు. 1956 జులై 26వ తేదీన ఈజిప్ట్ అధ్యక్షుడు గమాల్ అబ్దుల్ నాసర్ ఈ కంపెనీని జాతీయం చేశారు. ఇది ఐరోపా మహాశక్తులైన ఫ్రాన్స్, బ్రిటన్‌ను నేరుగా సవాలు చేసినట్లైంది. మరోవైపు అప్పటికే ఫ్రాన్స్‌కు వ్యతిరేకంగా అల్జీరియన్ నేషనల్ లిబరేషన్ ఫ్రంట్‌కు ఈజిప్ట్ మద్దతు ఇవ్వడం మొదలుపెట్టింది. దీంతోపాటు సోవియట్‌కు దగ్గర అవుతూ ఆయుధ కొనుగోళ్లు ప్రారంభించింది.

**ఇజ్రాయెల్ మొదలుపెడితే..**

1956 అక్టోబర్ 29న ఆపరేషన్ కదేష్ పేరిట ఈజిప్ట్‌పై దాడులు మొదలుపెట్టింది. యుద్ధ విమానాలు బాంబుల వర్షం కురిపించాయి. నవంబర్ నుంచి ఆపరేషన్ మస్కటీర్, టెలీస్కోప్‌ల పేరిట బ్రిటన్, ఫ్రాన్స్ సంయుక్తంగా ఈజిప్ట్‌పై దాడులు చేశాయి. పారాట్రూపర్లు రంగంలోకి దిగారు. ఆంగ్లో-ఫ్రెంచి దళాలు సూయజ్ కాల్వ కీలక రేవును, కెనాల్ ముగింపు ప్రాంతాన్ని ఆక్రమించాయి. ఇజ్రాయెల్ దళాలు సినాయ్ ప్రాంతాన్ని స్వాధీనం చేసుకొన్నాయి. ప్రపంచవ్యాప్తంగా ఈ ఆపరేషన్‌పై తీవ్ర వ్యతిరేకత వచ్చింది. ఆస్ట్రేలియా, న్యూజిలాండ్ మాత్రం బ్రిటన్‌కు మద్దతు ఇచ్చాయి. బ్రిటన్ ప్రధాని ఆంటోనీ ఎడెన్ నిర్ణయానికి నాడు స్వదేశంలో మద్దతు లభించలేదు.

**ఆగ్రహంతో ఊగిపోయిన అమెరికా..**

సూయజ్ ఆక్రమణతో అమెరికా తీవ్రంగా ఆందోళన చెందింది. అప్పటికే వేగంగా విస్తరిస్తున్న సోవియట్ యూనియన్ ఛత్రం కిందకు అరబ్ దేశాలు వెళ్లిపోతాయన్న ఆందోళన నాటి అమెరికా అధ్యక్షుడు ఐసన్‌హోవర్‌లో కనిపించింది. దీంతో బ్రిటన్‌కు కర్రకాల్చి వాత పెట్టాలని నిర్ణయించుకొన్నారు. సూయజ్ వద్దకు తన నౌకాదళాన్ని పంపకుండా ఆర్థికంగా ఒత్తిడి తీసుకురావాలని నిర్ణయించారు. వాస్తవానికి రెండో ప్రపంచ యుద్ధంలో బ్రిటన్ గెలిచినా.. దాని ఆర్థిక పరిస్థితి ఏమంత గొప్పగా లేదు. సూయజ్ ఆక్రమణ ఆపకపోతే బ్రిటన్‌పై ఆంక్షలు విధించడం, పౌండ్ స్టెర్లింగ్‌ను విక్రయించడం వంటివి చేస్తానని ఐసన్‌హోవర్ హెచ్చరించారు. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) నుంచి బ్రిటన్‌కు డాలర్ రుణాలు అందకుండా ఆపేశారు. దీంతో బ్రిటన్ పౌండ్ ధర భారీగా పతనమైంది. నవంబర్ మొదటివారంలోనే 100 మిలియన్ డాలర్ల రిజర్వులను బ్రిటన్ కోల్పోయింది. అమెరికా బెదిరింపులు, ఆర్థిక ఒత్తిళ్లతో బ్రిటన్ చేతులెత్తేసింది. ఈజిప్టు పక్షాన సోవియట్ దళాలు రంగంలోకి దిగే అవకాశం ఉండటంతో.. ఐరాస ప్రతిపాదించిన కాల్పుల విరమణకు 1956 నవంబర్ 7న అంగీకరించి.. అవమానకర రీతిలో యుద్ధం నుంచి వైదొలగింది. దీంతో ప్రపంచవ్యాప్తంగా బ్రిటన్ పరపతి పడిపోయి సూపర్ పవర్‌హోదాను కోల్పోయింది. పశ్చిమదేశాలకు అమెరికా పూర్తిస్థాయి లీడర్‌గా మారింది. 1957 ప్రారంభంలో బ్రిటన్ ప్రధాని ఆంటోనీ ఎడెన్ పదవి కోల్పోయారు.

**హర్మూజ్ వద్ద కూడా..**

తాజాగా హర్మూజ్ వద్ద యుద్ధంలో జోక్యానికి బ్రిటన్, ఫ్రాన్స్‌లు నిరాకరించాయి. రష్యా, చైనా ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ఇరాన్‌కు సాయం చేస్తున్నాయి. స్వదేశంలో ధరలు పెరగడం, అంతర్జాతీయంగా ద్రవ్యోల్బణం వంటివి ఇతర దేశాలను అమెరికాకు దూరం చేస్తున్నాయి. అంతేకాదు.. వ్యూహాత్మక లక్ష్యాలను వేటిని అమెరికా సాధించలేకపోవడంతో.. ఆ దేశ పరపతి ఘోరంగా దెబ్బతింది.

# ఈ 9 పనులు చేస్తామని మాటివ్వండి: మోదీ

శ్రద్ధగా, నిజాయతీగా పాటిస్తే కర్ణాటకతో పాటు దేశ అభివృద్ధీ వేగంగా జరుగుతుంది" అని మోదీ వెల్లడించారు. ప్రధాని అడిగిన హామీలు ఏంటంటే..

నీళ్లను వృథా చేయకుండా పొదుపుగా వాడదాం.

పబ్లిక్ ప్రదేశాల్లో పరిశుభ్రతను పాటిద్దాం

అమ్మ పేరుతో మొక్కలు నాటుదాం.

'వోకల్ ఫర్ లోకల్' స్వదేశీయతను చాటి చెబుదాం.

జాతీయ పర్యావరణ రంగాన్ని అభివృద్ధి చేద్దాం.

రసాయనాలు లేకుండా పంట సాగు చేద్దాం.

ఆహారంలో మిల్లెట్స్‌ని భాగం చేసుకుందాం.

నూనె పదార్థాలను పూర్తిగా తగ్గిద్దాం.

ఫిట్‌గా, బరువుని అదుపులో ఉంచుతూ, ప్రకృతికి సేవ చేద్దాం

ఇక, ఆయుష్మాన్ భారత్ పథకంలో భాగంగా కొన్ని కోట్ల మంది ప్రజలకు ఉచితంగా వైద్య సౌకర్యం అందిస్తున్నామని మోదీ ఈ సందర్భంగా వెల్లడించారు. ప్రస్తుతం ఈ పథకం కింద 70 ఏళ్లు పైబడిన వృద్ధులకు కూడా అవకాశం కల్పించామని గుర్తుచేశారు.

## మొదటి పేజీ తరువాయి

# నాపై నమ్మకంతో మరోసారి పదవి అప్పగించిన ముఖ్యమంత్రికి ధన్యవాదాలు

ఈ కీలక బాధ్యతలు అప్పగించినందుకు ముఖ్యమంత్రి, టీడీపీ అధినేత చంద్రబాబుకు ఆయన హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. అదే సమయంలో, పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్ నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు బుధవారం ఆయన అమరావతి నుంచి ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. ఒక బీసీ బిడ్డగా తనకు ఈ స్థాయిలో గుర్తింపు లభించడం చంద్రబాబు దూరదృష్టికి, బీసీల పట్ల ఆయనకున్న చిత్తశుద్ధికి నిదర్శనమని పల్లా శ్రీనివాసరావు పేర్కొన్నారు. కార్యకర్తల సంక్షేమమే లక్ష్యంగా, సీనియర్ల అనుభవాన్ని గౌరవిస్తూనే యువతను ప్రోత్సహిస్తామని తెలిపారు. భవిష్యత్ తరాలకు టీడీపీని ఒక తిరుగులేని రాజకీయ శక్తిగా తీర్చిదిద్దుతామని ఆయన భరోసా ఇచ్చారు. పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నారా లోకేశ్ బాధ్యతలు చేపట్టడం టీడీపీ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయమని పల్లా అభివర్ణించారు. తన పనితీరుతో క్షేత్రస్థాయి యంత్రాంగాన్ని, యువతరాన్ని ఏకతాటిపైకి తెచ్చిన లోకేశ్... రాబోయే రోజుల్లో పార్టీని మరిన్ని విజయాల వైపు నడిపిస్తారని ధీమా వ్యక్తం చేశారు. ఆయన నియామకం పార్టీ నవశకానికి వారధిగా నిలుస్తుందన్నారు. టీడీపీలో కార్యకర్తే అధినేత అని ఈ నియామకాలతో మరోసారి రుజువైందని పల్లా శ్రీనివాసరావు అన్నారు. సామాన్య మండల స్థాయి అధ్యక్షులకు సైతం అత్యున్నత కమిటీ అయిన పొలిట్ బ్యూరోలో స్థానం కల్పించడం అభినందనీయమన్నారు. జాతీయ, రాష్ట్ర కమిటీల్లో కొత్తగా నియమితులైన నాయకులందరికీ ఆయన శుభాకాంక్షలు తెలిపారు. వారి నియామకం వారి శ్రమకు, నిబద్ధతకు దక్కిన గుర్తింపు అని కొనియాడారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లి, పార్టీని అన్ని స్థాయిల్లో మరింత బలోపేతం చేయాలని ఆయన ఆకాంక్షించారు.

# కుంభమేళా తరహాలో గోదావరి పుష్కరాలు.. పవన్ కీలక ఆదేశాలు

తెలిపారు. మంగళగిరిలోని ఉప ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ వివిధ అంశాలపై చర్చించారని, ప్రధానంగా నిడదవోలు నియోజకవర్గంలో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖల ద్వారా జరుగుతున్న అభివృద్ధి వివరాలపై సమీక్షించారన్నారు..అదే విధంగా గోదావరి పుష్కరాల నిర్వహణపై దిశానిర్దేశం చేసినట్లు మంత్రి దుర్గేశ్ వెల్లడించారు. 2027 జూన్ 26 నుండి జులై 7 వరకు జరిగే గోదావరి పుష్కరాలను కుంభమేళా తరహాలో వైభవంగా నిర్వహించాలని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సూచించినట్లు మంత్రి దుర్గేశ్ చెప్పారు. 12 ఏళ్లకు ఒకసారి వచ్చే ఈ మహా ఉత్సవానికి సుమారు 10 కోట్ల మంది భక్తులు హాజరయ్యే అవకాశం ఉందని అంచనా వేశామని, భక్తుల సౌకర్యాలకు, భద్రతకు పెద్దపీట వేయాలని భావించినట్లు వెల్లడించారు. రాజమహేంద్రవరంతో పాటు గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ఘాట్ల ఆధునీకరణ పనులు ఇప్పటికే ప్రారంభమయ్యాయని మంత్రి దుర్గేశ్ పేర్కొన్నారు. భక్తుల కోసం ప్రత్యేక వసతులు, మంచినీరు, పారిశుద్ధ్యం మరియు విశ్రాంతి గదుల ఏర్పాటుపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు పేర్కొన్నారు. కోట్లాదిగా తరలివచ్చే భక్తుల భద్రతకు పెద్దపీట వేయాలని, ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా సమగ్ర కార్యాచరణను సిద్ధం చేయాలని పవన్ కల్యాణ్ ఆదేశించారని వివరించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి భక్తుల రద్దీని క్రమబద్ధీకరించనున్నట్లు మంత్రి దుర్గేశ్ వెల్లడించారు. పుష్కర ఏర్పాట్లపై త్వరలోనే రాజమహేంద్రవరంలో కూటమి నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులతో కలిసి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ విస్తృత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించనున్నట్లు మంత్రి కందుల దుర్గేశ్ తెలిపారు. ఈ భేటీలో క్షేత్రస్థాయి సమస్యలు, తీసుకోవాల్సిన చర్యలపై పలు నిర్ణయాలు తీసుకోనున్నామన్నారు. రాష్ట్ర గౌరవం ఇనుమడించేలా, ఆధ్యాత్మిక శోభ ఉట్టిపడేలా సీఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ల నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం ఈ గోదావరి పుష్కరాలను నిర్వహించబోతోందని మంత్రి దుర్గేశ్ ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

# చంద్రగిరిలో నారా రామ్మూర్తినాయుడు స్పోర్ట్స్ సెంటర్‌ను ప్రారంభించిన మంత్రి లోకేశ్

ఘనస్వాగతం పలికారు. అనంతరం ఆయన నారా రామ్మూర్తినాయుడు మల్టీ పర్పస్ ఇండోర్ స్టేడియం శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన ప్రాంగణంలోని క్రీడా సౌకర్యాలను పరిశీలించారు. చిన్నారులతో టేబుల్ టెన్నిస్, హాకీ ఆడుతూ వారిలో ఉత్సాహం నింపారు. వారితో కలిసి ఫోటోలు దిగారు. సీఎం చంద్రబాబు విద్యాభ్యాసం చేసిన చంద్రగిరి బాలుర ఉన్నత పాఠశాలలో రూ.3.17 కోట్ల వ్యయంతో ఈ క్రీడా వికాస కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. జాతీయ స్థాయి క్రీడా పోటీలు నిర్వహించుకునేందుకు వీలుగా దీన్ని తీర్చిదిద్దారు. 2017లో నాటి తెలుగుదేశం ప్రభుత్వం ఈ కేంద్రాన్ని మంజూరు చేయగా, గత ప్రభుత్వ హయాంలో పనులు పూర్తిగా నిలిచిపోయాయి. తాజాగా ప్రజా ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక, ప్రత్యేక చొరవ తీసుకుని పనులు పూర్తి చేసి క్రీడాకారులకు అందుబాటులోకి తెచ్చింది. ఈ మల్టీపర్పస్ ఇండోర్ స్టేడియంలో బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్, క్యారమ్స్, చెస్, స్కిప్పింగ్, యోగా, జిమ్ వంటి సౌకర్యాలు ఉన్నాయి. అలాగే అవుట్‌డోర్‌లో వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బాల్ బ్యాడ్మింటన్ కోర్టులతో పాటు ప్రత్యేక హాకీ మైదానాన్ని కూడా సిద్ధం చేశారు. చంద్రగిరి, పరిసర ప్రాంతాల యువ క్రీడాకారుల శిక్షణ, అభివృద్ధికి ఈ కేంద్రం ఒక వేదికగా నిలుస్తుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏపీ రవాణా, యువజన, క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, జిల్లా ఇంఛార్జ్ మంత్రి అనగాని సత్యప్రసాద్, శాప్ ఛైర్మన్ అనిమిని రవినాయుడు, చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే పులివర్తి నాని, చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, చిత్తూరు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు సి.షణ్ముగ రెడ్డి, ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్, చంద్రగిరి నియోజకవర్గ పరిశీలకుడు డాక్టర్ శ్రీపతి బాబు, బ్యాడ్మింటన్ క్రీడాకారులు పీవీ సింధు, కిదాంబి శ్రీకాంత్, దండు పూజ, భారత హాకీ క్రీడాకారిణి రజని ఇటిమరపు తదితరులు పాల్గొన్నారు.

## సాఫ్ట్‌వేర్ విద్యార్థికి న్యాయం చేసిన విశాఖ నగర పోలీసులు

### సీపీ చొరవతో ఒరిజినల్ సర్టిఫికెట్లు అప్పగింత



**విశాఖపట్నం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 15**

ఉద్యోగం మానేశాడన్న కారణంతో సాఫ్ట్‌వేర్ విద్యార్థికి చెందిన ఒరిజినల్ విద్యార్హత సర్టిఫికెట్లను అక్రమంగా నిలిపివేసిన ఓ సాఫ్ట్‌వేర్ కంపెనీ నుంచి విశాఖ నగర పోలీసులు ఆ సర్టిఫికెట్లను ఇప్పించి బాధితుడికి న్యాయం చేశారు. కాకినాడకు చెందిన యువకుడు విశాఖపట్నంలోని ఒక సాఫ్ట్‌వేర్ కంపెనీలో పనిచేస్తుండగా, వ్యక్తిగత కారణాలతో ఉద్యోగం మానివేశాడు. అయితే, ఉద్యోగంలో చేరే సమయంలో సెక్యూరిటీ కింద తీసుకున్న అతని ఒరిజినల్ డిగ్రీ, ఇతర విద్యార్హత సర్టిఫికెట్లను తిరిగి ఇవ్వడానికి కంపెనీ యాజమాన్యం నిరాకరించింది. దీంతో తదుపరి ఉద్యోగ అవకాశాలు, ఉన్నత చదువులకు తీవ్ర ఆటంకం ఏర్పడడంతో బాధితుడు ఆవేదన చెందాడు. ఈ సమస్య పరిష్కారం కోసం బాధిత యువకుడు పీజీఆర్ఎస్ ద్వారా విశాఖపట్నం పోలీస్ కమీషనర్, అదనపు జిల్లా మేజిస్ట్రేట్ డా. శంఖబ్రత బాగ్చి కి ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదును పరిశీలించిన సీపీ వెంటనే స్పందించి, బాధితుడికి న్యాయం చేయాలని అధికారులను ఆదేశించారు. సీపీ ఆదేశాల మేరకు మహారాణిపేట పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ సదరు సాఫ్ట్‌వేర్ కంపెనీ ప్రతినిధులను స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒరిజినల్ సర్టిఫికెట్లను నిలుపుదల చేయడం చట్టవిరుద్ధమని, దీనివల్ల సంస్థపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని పోలీసులు స్పష్టం చేశారు. పోలీసుల ప్రమేయంతో దిగివచ్చిన కంపెనీ యాజమాన్యం బాధిత విద్యార్థికి అతని అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్లను ఎలాంటి షరతులు లేకుండా తిరిగి అప్పగించింది. ఈ సందర్భంగా నగర పోలీస్ కమీషనర్ డా. శంఖబ్రత బాగ్చి మాట్లాడుతూ, "ఉద్యోగుల ఒరిజినల్ సర్టిఫికెట్లను ఏ సంస్థ కూడా తమ వద్ద ఉంచుకోవడానికి వీల్లేదు. ప్రజా సమస్యల పరిష్కారమే మా ప్రథమ కర్తవ్యం. పీజీఆర్ఎస్ ద్వారా అందే ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి, బాధితులకు సత్వర న్యాయం చేసేందుకు విశాఖపట్నం నగర పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంది" అని తెలిపారు. సర్టిఫికెట్లు అందుకున్న బాధిత యువకుడు సీపీ కి పోలీస్ శాఖకు కృతజ్ఞతలు తెలిపాడు.

## కైలాసగిరిలో త్రిశూల్ ఆకర్షణగా పర్యాటకులకు కొత్త అనుభవం

### వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్






**కైలాసగిరి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :15**

ప్రఖ్యాత పర్యాటక కేంద్రం కైలాసగిరిపై నిర్మాణంలో ఉన్న త్రిశూల్‌ను అత్యంత ఆకర్షణీయంగా తీర్చిదిద్దుతూ త్వరలో ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని వీఎంఆర్డీఏ చైర్మన్ ఎం.వి. ప్రణవ్ గోపాల్ తెలిపారు. బుధవారం ఉదయం ఆయన కైలాసగిరి ప్రాంతంలో త్రిశూల్ నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ఈ నెలాఖరులోగా త్రిశూల్ ప్రారంభానికి అవసరమైన అన్ని చర్యలు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. త్రిశూల్ పరిసర ప్రాంతాలను మరింత అందంగా తీర్చిదిద్దుతూ పచ్చదనాన్ని పెంపొందించాలని సూచించారు. సందర్శకులకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు బెంచీలు, తాగునీటి సదుపాయాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. అదేవిధంగా, శివలింగాకార నమూనాలో వర్టికల్ గార్డెనింగ్ అభివృద్ధి చేసి ప్రత్యేక ఆకర్షణగా రూపొందించాలని సూచించారు. భద్రతకు ప్రాధాన్యత ఇస్తూ సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ప్రాంతమంతా ఆధ్యాత్మిక వాతావరణం ప్రతిబింబించేలా అభివృద్ధి చేయాలని తెలిపారు. వేసవి సెలవుల నేపథ్యంలో కైలాసగిరికి సందర్శకుల రద్దీ పెరిగే అవకాశముందని పేర్కొంటూ, ఘాట్ రోడ్డులో చివరి మలుపు నుంచి తెలుగు మ్యూజియం వరకు నిర్మించిన రహదారిని వెంటనే అందుబాటులోకి తీసుకురావాలని ఆదేశించారు. అలాగే ఘాట్ రోడ్డులో అదనపు సిబ్బందిని నియమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి మురళీకృష్ణ, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, కార్యనిర్వహక ఇంజనీర్లు భవాని శంకర్, మధు, డీఎఫ్ఓ శిరీషతో పాటు ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచితాల మాయలో రాజకీయాలు...

# ప్రజల భవిష్యత్తు ఎటు..?

దేశంలో రాజకీయాలు ప్రజల అసలు సమస్యల చుట్టూ తిరగాల్సింది పోయి, "ఉచితాలు" అనే మాయలో చిక్కుకుపోతున్నాయన్న విమర్శలు రోజురోజుకు పెరుగుతున్నాయి. ఎన్నికల సమయం దగ్గర పడితే పథకాల హామీలు, నగదు పంపిణీలు, తాత్కాలిక లాభాల ప్రలోభాలు రాజకీయ పార్టీల ప్రధాన ఆయుధాలుగా మారుతున్నాయి. అయితే ఈ చర్యలు ప్రజల జీవితాల్లో దీర్ఘకాలిక మార్పు తీసుకువస్తున్నాయా? అనే ప్రశ్నకు సమాధానం మాత్రం కనిపించడం లేదు. ప్రస్తుతం సాధారణ కుటుంబాల పరిస్థితి చూస్తే ఆర్థిక ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోంది. పెరుగుతున్న ధరలు, పన్నుల భారంతో జీవనం కష్టమవుతోంది. రోజువారీ కూలీలు పనిలేక ఇబ్బంది పడుతుండగా, చదువుకున్న యువత ఉద్యోగాల కోసం అల్లాడుతోంది. రైతులు పంటలు పండించినా సరైన ధరలు లభించక నష్టాల్లో కూరుకుపోతున్నారు. మధ్యతరగతి కుటుంబాలు పిల్లల చదువు, వైద్యం కోసం అప్పులపాలవుతున్నాయి. ఇవన్నీ ప్రజలు ఎదుర్కొంటున్న వాస్తవ సమస్యలు. ఈ పరిస్థితుల్లో ప్రభుత్వాలు సంక్షేమ పథకాల పేరుతో అప్పులు తీసుకుని నగదు పంపిణీ చేయడం పై ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ అప్పుల భారం చివరకు ప్రజలపైనే పడుతుందని, పన్నుల రూపంలో లేదా ధరల పెరుగుదల రూపంలో ప్రజలే చెల్లించాల్సి వస్తుందని వారు హెచ్చరిస్తున్నారు. ప్రజల డబ్బునే తిరిగి ఇవ్వడం ద్వారా సంక్షేమం అందిస్తున్నామనే ప్రచారం సరికాదని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. నిపుణుల అభిప్రాయం ప్రకారం ప్రజలకు తాత్కాలిక ఉచితాల కంటే స్థిరమైన హక్కులు అవసరం. ప్రతి ఒక్కరికి నాణ్యమైన విద్య, అందుబాటు వైద్యం, స్థిరమైన ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వాల ప్రధాన బాధ్యతగా ఉండాలని వారు సూచిస్తున్నారు. కానీ ఈ కీలక రంగాల్లో పురోగతి ఆశించిన స్థాయిలో కనిపించడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రత్యేకించి గ్రామీణ మరియు ఏజెన్సీ ప్రాంతాల పరిస్థితి మరింత ఆందోళన కలిగిస్తోంది. అక్కడ మౌలిక సదుపాయాలు ఇంకా పూర్తిగా అభివృద్ధి చెందలేదు. రహదారులు, ఆసుపత్రులు, పాఠశాలలు సరైన స్థాయిలో లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అనారోగ్య పరిస్థితుల్లో సమయానికి వైద్యం అందక ప్రాణనష్టాలు సంభవిస్తున్నాయని నివేదికలు సూచిస్తున్నాయి. విద్యా సదుపాయాల లోపం కారణంగా పిల్లల భవిష్యత్తు దెబ్బతింటోంది. వ్యవసాయ రంగం




**పన్నుల భారం & సామాన్యుడి ఆవేదన - ఉచిత పథకాల వెనుక ఉన్న రాజకీయ మభ్యపెట్టడం: ఒక విశ్లేషణ**

కూడా అనిశ్చితిలోనే కొనసాగుతోంది. ప్రకృతి ఆధారిత వ్యవసాయం, మార్కెట్‌లో ధరల స్థిరత్వం లేకపోవడం వల్ల రైతులు అప్పుల బారిన పడుతున్నారు. ప్రభుత్వాల నుంచి వచ్చే సహాయం తాత్కాలిక ఉపశమనమే తప్ప, సమస్యకు శాశ్వత పరిష్కారం కాదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఇక మధ్యతరగతి పరిస్థితి కూడా దయనీయంగా మారుతోంది. విద్యా, వైద్య ఖర్చులు పెరగడంతో కుటుంబాల ఆర్థిక స్థితి కుదేలవుతోంది. ఒక చిన్న అనారోగ్య సమస్య కూడా పెద్ద ఆర్థిక భారంగా మారుతున్నది. ఈ నేపథ్యంలో ఉచితాల రూపంలో ఇచ్చే సాయం దీర్ఘకాలిక భద్రతను కల్పించలేదని విశ్లేషకులు చెబుతున్నారు. అదే సమయంలో ప్రభుత్వాల ఆర్థిక నిర్వహణపై కూడా ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. ఎన్నికల ముందు, తర్వాత నాయకుల ఆస్తుల పెరుగుదల, ప్రభుత్వ అప్పుల పెరుగుదల, ఆ నిధుల వినియోగంపై పారదర్శకత లేకపోవడం వంటి అంశాలు చర్చనీయాంశంగా మారాయి. ప్రజల డబ్బు ఎలా ఖర్చవుతోందో వెల్లడించే బాధ్యత ప్రభుత్వాలపై ఉందని నిపుణులు సూచిస్తున్నారు. ప్రస్తుత ధోరణి కొనసాగితే ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రభుత్వ అప్పులు పెరిగి, అభివృద్ధి రంగాలపై పెట్టుబడులు తగ్గితే నిరుద్యోగం మరింత పెరిగే అవకాశం ఉందని వారు అంటున్నారు. అలాగే విద్య, వైద్యం బలహీనపడితే సమాజం మొత్తం వెనుకబడే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. మొత్తానికి, ఉచితాలపై ఆధారపడే రాజకీయాల కంటే అభివృద్ధి, ఉపాధి, మౌలిక సదుపాయాలపై దృష్టి సారించడం అత్యవసరమని నిపుణులు సూచిస్తున్నారు. ప్రజలు కూడా తాత్కాలిక లాభాలకంటే దీర్ఘకాలిక ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని నిర్ణయాలు తీసుకోవాల్సిన అవసరం ఉందని అభిప్రాయపడుతున్నారు.

## నాపై నమ్మకానికి కృతజ్ఞతలు...

### టీడీపీ బలోపేతమే లక్ష్యం : పల్లా శ్రీనివాసరావు

**గాజువాక, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్: 15**



తనపై నమ్మకముంచి రెండోసారి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ అధినేత, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కి పల్లా శ్రీనివాసరావు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. ఈ గుర్తింపు తనపై ఉన్న నమ్మకానికి నిదర్శనమని పేర్కొన్నారు. అట్టడుగు వర్గాలు, బీసీలకు రాజకీయంగా అండగా నిలబడిన పార్టీగా టీడీపీ ప్రత్యేక గుర్తింపు పొందిందని ఆయన అన్నారు. ఒక బీసీ కుటుంబానికి చెందిన తనకు ఈ స్థాయి అవకాశం రావడం చంద్రబాబు నాయుడు దూరదృష్టి, చిత్తశుద్ధికి ఉదాహరణ అని తెలిపారు. పార్టీ కార్యకర్తల సంక్షేమమే ప్రధాన ధ్యేయమని స్పష్టం చేసిన ఆయన, సీనియర్ల అనుభవాన్ని గౌరవిస్తూ, యువతకు ప్రాధాన్యం ఇస్తూ టీడీపీని భవిష్యత్ తరాలకు మరింత శక్తివంతంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ఈ సందర్భంగా పార్టీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్‌గా బాధ్యతలు చేపట్టిన నారా లోకేష్ కి అభినందనలు తెలిపారు. ఆయన నాయకత్వం పార్టీకి కొత్త దిశానిర్దేశం చేస్తుందని, క్షేత్రస్థాయి నుండి యువత వరకు అందరినీ ఏకతాటిపైకి తీసుకువచ్చే సామర్థ్యం ఉన్న నాయకుడని కొనియాడారు. "టీడీపీలో కార్యకర్తే అధినేత" అనే సిద్ధాంతం మరోసారి రుజువైందని, సామాన్య కార్యకర్తలకు కూడా జాతీయ, రాష్ట్ర స్థాయిలో బాధ్యతలు ఇవ్వడం పార్టీ ప్రత్యేకత అని అన్నారు. పొలిట్ బ్యూరో వంటి అత్యున్నత కమిటీల్లో కింది స్థాయి నాయకులకు అవకాశం కల్పించడం అభినందనీయమని పేర్కొన్నారు. జాతీయ, రాష్ట్ర కమిటీల్లో కొత్తగా నియమితులైన సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి నాయకత్వంలో పార్టీ మరింత బలపడుతుందని, ప్రభుత్వ కార్యక్రమాలు ప్రజల్లోకి విస్తృతంగా చేరుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు.

## భారత రాజ్యాంగంలో ఆర్టికల్ 24




భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 24 ప్రకారం, 14 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలను ఏదైనా కర్మాగారం, గని లేదా ఇతర ప్రమాదకర వృత్తుల్లో నియమించడం నిషేధించబడింది. ఈ నిబంధన యొక్క ముఖ్య ఉద్దేశ్యం పిల్లలపై దోపిడీని నివారించడం, వారి ఆరోగ్యం మరియు సమగ్ర అభివృద్ధిని కాపాడటం, అలాగే వారికి విద్య పొందే అవకాశాన్ని కల్పించడం. అయితే, ఈ ఆర్టికల్ కొన్ని మినహాయింపులను కూడా అనుమతిస్తుంది. ప్రమాదకరం కాని కుటుంబ ఆధారిత పనుల్లో, పాఠశాల పాఠ్యాంశాల్లో భాగంగా చేసే పనుల్లో లేదా హానికరం కాని ఇతర వృత్తుల్లో పిల్లలను పరిమితంగా నిమగ్నం చేయవచ్చు. ప్రమాదకరంగా పరిగణించబడే వృత్తులు మరియు ప్రక్రియలను నిర్ణయించేందుకు చట్టాలను రూపొందించే అధికారం ప్రభుత్వానికి ఉంది. ఈ నిబంధనను సమర్థవంతంగా అమలు చేయడానికి అవసరమైన నియమాలు మరియు పరిమితులను విధించే అధికారం కూడా ప్రభుత్వానిదే. ఆర్టికల్ 24, ఆర్టికల్ 21 (6 నుండి 14 సంవత్సరాల పిల్లలకు విద్య హక్కు)తో సన్నిహిత సంబంధం కలిగి ఉంది. బాల కార్మికులను నిషేధించడం ద్వారా, ఈ ఆర్టికల్ పిల్లలు పాఠశాలలో చదువుకునే అవకాశాన్ని పెంచుతుంది మరియు వారి భవిష్యత్తు అభివృద్ధికి మార్గం సుగమం చేస్తుంది.

కేసులో ఉదాహరణ : మొహత వర్సెస్ వర్సెస్ తమిళనాడు రాష్ట్రం (1997) కేసులో, సుప్రీంకోర్టు బాణసంచా పరిశ్రమలో బాల కార్మికుల సమస్యను ప్రస్తావించింది. బాణసంచా తయారీ వంటి ప్రమాదకర పరిశ్రమల్లో పిల్లలను నియమించడం నిషేధించబడాలని కోర్టు స్పష్టం చేసింది. బాలల హక్కులను రక్షించేందుకు ఆర్టికల్ 24ను కఠినంగా అమలు చేయాలని ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలను కూడా సూచించింది.

జె. కనక దుర్గ లక్ష్మీ
ఇంటర్నేషనల్ హ్యూమన్ రైట్స్ (IHR)
ఉత్తరాంధ్ర ఇంచార్జి.

## అనకాపల్లి పోలీసులకు ఎస్పీ తుహిన్ సిన్హా కఠిన ఆదేశాలు





**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్: 15**

అనకాపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ఎస్పీ తుహిన్ సిన్హా ఐపీఎస్ అధ్యక్షతన నెలవారీ నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లాలో పెండింగ్ కేసులు, రోడ్డు ప్రమాదాల నివారణ, శాంతిభద్రతల పరిరక్షణ, సాంకేతిక పరిజ్ఞాన వినియోగంపై అధికారులకు స్పష్టమైన దిశానిర్దేశం చేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. హెల్మెట్ లేకుండా డ్రైవింగ్, సీట్ బెల్ట్ వినియోగం లేకపోవడం, రాంగ్ రూట్ డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్, డ్రంక్ అండ్ డ్రైవ్‌లపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పెండింగ్ చలానాలు చెల్లించని వాహనాలను సీజ్ చేసి, లైసెన్సుల రద్దుకు రవాణా శాఖకు సిఫార్సు చేయాలని తెలిపారు. మహిళా సంరక్షణ కార్యదర్శుల ద్వారా ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన కల్పించాలని సూచించారు. సైబర్ నేరాలు, మహిళలపై నేరాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని, అవగాహన సదస్సులు నిర్వహించాలని తెలిపారు. దర్యాప్తులో ఫేస్ రికగ్నిషన్, సర్విలియన్స్ సిసిటిఎన్ఎస్ ఈ-సాక్ష్య, యాప్ 360 వంటి సాంకేతిక సాధనాలను విస్తృతంగా వినియోగించాలని సూచించారు. తప్పిపోయిన బాలబాలికలు, చోరీకి గురైన వాహనాల గుర్తింపులో సాంకేతికతను ఉపయోగించాలని చెప్పారు. పారిశ్రామిక ప్రాంతాల పోలీస్ స్టేషన్లలో ఎస్ఓపి లను కచ్చితంగా అమలు చేసి, ప్రమాదాల సమయంలో తక్షణ స్పందనకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. స్టేషన్లలో నిల్వ ఉన్న పేలుడు పదార్థాలను కోర్టు అనుమతితో ఫైర్ అధికారుల సమక్షంలో నాశనం చేయాలని తెలిపారు. స్మార్ట్ పోలీసింగ్‌లో భాగంగా సీసీటీఎన్ఎస్ లో డేటా అప్లోడ్‌లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన పోలీసు సిబ్బందిని ప్రశంసా పత్రాలతో అభినందించారు.

# పాడేరు మోదకొండమ్మ జాతర తేదీల మార్పుపై వివాదం

## ఉత్సవ కమిటీ నిర్ణయాలను మార్చడంపై ఎమ్మెల్యే తీవ్ర విమర్శలు





**పాడేరు,సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :15**

ఉత్తరాంధ్ర ప్రాంత ప్రజల ఆరాధ్య దైవమైన శ్రీ శ్రీ శ్రీ మోదకొండమ్మ అమ్మవారి జాతర తేదీల మార్పు అంశం తీవ్ర వివాదాస్పదంగా మారింది. ఉత్సవ కమిటీ, గ్రామ పెద్దలు మరియు అన్ని రాజకీయ పార్టీల సమన్వయంతో ముందుగా మే 10, 11, 12 తేదీలను జాతర నిర్వహణకు నిర్ణయించిన విషయం తెలిసిందే. అయితే, తాజాగా జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జరిగిన సమన్వయ సమావేశంలో మంత్రి గుమ్మడి సంధ్యారాణి, అధికారులతో కలిసి ఆ తేదీలను మార్చడంపై నిర్ణయం తీసుకోవడం వివాదానికి దారితీసింది. ఈ చర్యపై స్థానిక ఎమ్మెల్యే మరియు ఉత్సవ కమిటీ అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు తీవ్రంగా ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామ దేవత జాతర తేదీలను నిర్ణయించే అధికారం మీకు ఎవరు ఇచ్చారు?" అంటూ మంత్రి చర్యలను ఆయన బహిరంగంగా ఖండించారు. దశాబ్దాలుగా కొనసాగుతున్న సంప్రదాయాలను విస్మరించి, రాజకీయ ప్రయోజనాల కోసం జాతర తేదీలను మార్చడం గిరిజనుల మనోభావాలను దెబ్బతీసిందని విమర్శించారు. సుమారు 40 ఏళ్లుగా గ్రామ పెద్దలు, స్థానిక ప్రజలు, అన్ని రాజకీయ పార్టీల సమన్వయంతో సంప్రదాయబద్ధంగా జాతర నిర్వహించబడుతూ వస్తోందని, ఈసారి మాత్రం ప్రభుత్వ జోక్యం వల్ల అనవసర వివాదం తలెత్తిందని పేర్కొన్నారు. ఇక ప్రజలు కూడా ఈ పరిణామంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. పక్క రాష్ట్రాలైన ఒడిశా, తమిళనాడు నుంచి కూడా లక్షలాది భక్తులు తరలివచ్చే ఈ జాతరను అవమానించేలా వ్యవహరించారని విమర్శిస్తున్నారు. భక్తుల విశ్వాసాలను గౌరవించకుండా తీసుకున్న ఈ నిర్ణయం అన్యాయమని అభిప్రాయపడుతున్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, "మోదకొండమ్మ తల్లి జాతర అనేది గిరిజనుల ఆత్మగౌరవానికి ప్రతీక. దీన్ని రాజకీయ ప్రయోజనాల కోసం వాడుకోవడం తగదు. భక్తుల మనోభావాలను దెబ్బతీసే చర్యలు ఎవరికీ మేలు చేయవు" అని హెచ్చరించారు.మొత్తం మీద, జాతర తేదీల మార్పు అంశం రాజకీయ రంగు పులుముకుని, ప్రజల్లో అసంతృప్తిని రగిలిస్తోంది.

# నేటి నుంచి స్వీయ గణన ప్రారంభం

## ప్రజల భాగస్వామ్యం కీలకం

### కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్



**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :15**

జనగణన--2027 ప్రక్రియలో భాగంగా ప్రభుత్వం ప్రవేశపెట్టిన స్వీయ గణన కార్యక్రమం నేటి నుంచి ప్రారంభమవుతోందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విజ్ఞప్తి చేశారు. జిల్లావ్యాప్తంగా అన్ని వర్గాల ప్రజలు ఈ వినూత్న విధానాన్ని ఉపయోగించుకుని, తమ కుటుంబ వివరాలను స్వయంగా నమోదు చేసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఏప్రిల్ 16 నుంచి ఏప్రిల్ 30, 2026 వరకు పోర్టల్ ద్వారా స్వీయ గణన చేయవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి జిల్లా యంత్రాంగం ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ఉద్యోగులు, విద్యార్థులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, కార్మికులు చురుకుగా పాల్గొని ఇతరులకు మార్గదర్శకులుగా నిలవాలని కోరారు. అలాగే ప్రతి స్వర్ణ గ్రామం, స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది రోజుకు కనీసం 10 నుంచి 20 మందికి స్వీయ గణనలో సహకారం అందించాలని కలెక్టర్ ఆదేశించారు. సమాజంలోని ప్రముఖులు ముందుండి తమ వివరాలను నమోదు చేసుకుని ప్రజల్లో అవగాహన పెంచాలని పిలుపునిచ్చారు. ఈ స్వీయ గణన పూర్తిగా స్వచ్ఛంద ప్రక్రియ అని, ఎవరిపైనా ఒత్తిడి చేయరాదని స్పష్టం చేశారు. దేశ భవిష్యత్ ప్రణాళికలకు అవసరమైన కచ్చితమైన గణాంకాల కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా పాల్గొనాలని ఆయన విజ్ఞప్తి చేశారు. జిల్లాలోని అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో పనిచేసి ఈ జాతీయ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ తన ప్రకటనలో సూచించారు.

# రోడ్డు పై అదుపు తప్పిన లారీ పక్కకు ఒరిగి బోల్తా



**పెందుర్తి,సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :15**

పెందుర్తి మండలంలోని అసకపల్లి సమీపంలో బుధవారం అతివేగంతో వెళ్తున్న కంటైనర్ లారీ అదుపు తప్పి బోల్తా పడిన ఘటన చోటుచేసుకుంది. హైదరాబాద్ నుంచి అనకాపల్లి వైపు ప్రయాణిస్తున్న ఈ లారీ, డ్రైవర్ వేగం నియంత్రించలేకపోవడంతో రోడ్డుపై నియంత్రణ కోల్పోయి పక్కకు ఒరిగి పడింది. ఈ ప్రమాదం జరిగిన సమయంలో లారీలో ఉన్న డ్రైవర్, క్లీనర్ స్వల్ప గాయాలతోనే బయటపడటం అదృష్టకరంగా భావిస్తున్నారు. ఎటువంటి ప్రాణనష్టం జరగకపోవడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదం సమాచారం అందుకున్న వెంటనే స్థానిక పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. లారీ బోల్తా పడటంతో కొంతసేపు రాకపోకలకు అంతరాయం ఏర్పడగా, అనంతరం పోలీసులు చర్యలు తీసుకుని ట్రాఫిక్‌ను సజావుగా మార్చారు. అతివేగమే ఈ ప్రమాదానికి ప్రధాన కారణమని పోలీసులు భావిస్తున్నారు. లారీ నంబర్ ౨+08ఙ5908గా గుర్తించారు. డ్రైవర్లు వేగ నియంత్రణ పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

# నారీ శక్తి వందన్ కార్యక్రమం విశాఖలో ఘనంగా నిర్వహణ






**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :15**

కూటమి మహిళా నాయకుల ఆధ్వర్యంలో "నారీ శక్తి వందన్ అభినందన" కార్యక్రమం విశాఖపట్నంలోని వి.యం.ఆర్.డి.ఎ చిల్డ్రన్స్ థియేటర్‌లో ఘనంగా నిర్వహించారు. మహిళలకు 33% రిజర్వేషన్ అమలులోకి రానున్న సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమానికి బీజేపీ జిల్లా అధ్యక్షుడు ఎం.ఎం.ఎన్ పరశురామరాజు అధ్యక్షత వహించగా, జిల్లా మహిళా అధ్యక్షురాలు నాదెళ్ల జ్యోతి సమన్వయం చేశారు. ముఖ్య అతిథిగా బీజేపీ మహిళా మోర్చా రాష్ట్ర అధ్యక్షురాలు నిషిదా రాజు హాజరై మహిళల సాధికారత, రాజకీయాల్లో మహిళల భాగస్వామ్యం పెంపుపై ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. కార్యక్రమంలో కూటమి మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ స్టేట్ సెక్రటరీ ఉమ్మడి సుజాత రాజు, టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు అనంతలక్ష్మి, జనసేన రీజనల్ కోఆర్డినేటర్ ఉషారాణి, పసుపులేటి ఉషాకిరణ్, బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రోహిణి, రాష్ట్ర ఉపాధ్యక్షురాలు లలిత, జనసేన రీజనల్ కోఆర్డినేటర్ లక్ష్మీ చౌదరి, టీడీపీ సీనియర్ నాయకురాలు కేదార లక్ష్మీ, జనసేన నాయకులు సుధా, త్రివేణి పాల్గొన్నారు.

# 467/470 మార్కులతో అగ్రస్థానంలో రామబాణం విద్యార్థిని

## లక్ష్మిప్రియను అభినందించిన చైర్మన్ వాసుపల్లి గణేష్

**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :15**

జెపీఈ 2026 జూనియర్ ఇంటర్ పరీక్షల్లో రామబాణం కళాశాల అత్యుత్తమ ఫలితాలు సాధించింది. ఎస్. లక్ష్మిప్రియ 470 మార్కులకు 467 మార్కులు సాధించి స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించింది. ఈ విజయాన్ని పురస్కరించుకుని కళాశాల 104 బ్రాంచ్‌లో ఘనంగా సంబరాలు నిర్వహించారు. కళాశాల ప్రాంగణం పండుగ వాతావరణంలో మునిగిపోయింది. సిబ్బంది బాణాసంచా కాల్చి విద్యార్థిని అభినందించారు. ఈ సందర్భంగా కళాశాల చైర్మన్, విశాఖ దక్షిణ నియోజకవర్గం వైసీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ మాట్లాడుతూ లక్ష్మిప్రియ సాధించిన విజయం తమ అకాడమీకి గర్వకారణమని అన్నారు. తమ సంస్థలో ఉన్న అత్యుత్తమ బోధనా విధానం వల్లే ఇలాంటి ఫలితాలు సాధ్యమవుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుపై ఏకాగ్రత పెంచి, పరీక్షల్లో మంచి ప్రతిభ కనబరుస్తున్నారని ఆయన ప్రశంసించారు. గతంలో కూడా తమ అకాడమీ పలు పరీక్షల్లో రికార్డు ఫలితాలు సాధించిందని




తెలిపారు.విద్యార్థుల భవిష్యత్తుకు బలమైన పునాది వేయడమే తమ లక్ష్యమని పేర్కొంటూ, వివిధ బ్రాంచ్‌లలో చదువుతున్న విద్యార్థులు అత్యుత్తమ ర్యాంకులు సాధిస్తున్నారని వెల్లడించారు. బాలికలు ప్రతిభాపాటవాలు కనబరుస్తూ విజయపథంలో ముందుకు సాగడం సంస్థకు గర్వకారణమని వాసుపల్లి గణేష్ కుమార్ తెలిపారు.

# చెత్త పాయింట్ల నిర్మూలనకు కఠిన చర్యలు

## జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ ఆదేశాలు





**విశాఖపట్నం, సిటిజన్ టైమ్స్,ఏప్రియల్ :15**

నగరంలో గార్బేజ్ వల్నరబుల్ పాయింట్స్‌ను (చెత్తకు గురయ్యే ప్రదేశాలు) గుర్తించి వాటిని వెంటనే అరికట్టి నియంత్రించాలని జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్ అధికారులకు ఆదేశించారు. రోడ్లు, వీధులు, కాలనీలు మరియు బహిరంగ ప్రదేశాలలో వ్యర్థాలు వేయకుండా ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. బుధవారం క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా దక్షిణ జోన్ 29వ వార్డు పరిధిలోని ప్రకాశరావుపేట ప్రాంతంలో అదనపు కమిషనర్ పి. నల్లనయ్య, జోనల్ కమిషనర్ మల్లయ్య నాయుడుతో కలిసి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా జివిపి పాయింట్ల వద్ద చెత్త పేరుకుపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేసిన కమిషనర్, శానిటరీ సిబ్బంది పనితీరుపై ఆరా తీశారు. ఖాళీ స్థలాల్లో చెత్త వేయకుండా ప్రజలకు నిరంతరం అవగాహన, కల్పించాలని, చెత్త వేయడాన్ని అలవాటు చేసుకున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.పారిశుద్ధ్య నిర్వహణలో ఎలాంటి అలసత్వం లేకుండా నిర్ణీత సమయానికి కార్మికులు, క్లాప్ వాహనాలు కాలనీల్లో అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. వేసవి కాలాన్ని దృష్టిలో ఉంచుకుని ఉదయం 5:30 గంటలకే పారిశుద్ధ్య పనులు ప్రారంభించేలా చూడాలని సూచించారు. ఇంటింటి నుండి చెత్త సేకరణ సక్రమంగా జరుగుతున్నదా, క్లాప్ వాహనాలు సమయానికి వస్తున్నాయా అని స్థానిక ప్రజలను విచారించారు. ప్రతి క్లాప్ వాహనం కనీసం మూడు ట్రిప్పులు తప్పనిసరిగా నిర్వహించాలని ఆదేశించారు. రాత్రి పారిశుద్ధ్య పనుల నిర్వహణపై కూడా వివరాలు తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సహాయ వైద్యాధికారి డాక్టర్ కృష్ణంరాజు, శానిటరీ ఇన్స్పెక్టర్లు, సూపర్వైజర్లు, వార్డు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

# విశాఖ సిటీ పోలీస్ వార్షిక క్రీడలు - షటిల్ పోటీల్లో సీఐ దివాకర్ యాదవ్ ప్రతిభ

**మహారాణి పేట, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్: 15**

విశాఖపట్నం సిటీ పోలీస్ విభాగం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వార్షిక క్రీడా పోటీల్లో భాగంగా మంగళవారం జరిగిన షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు ఉత్కంఠభరితంగా, హోరాహోరీగా సాగాయి. నగరంలోని వివిధ పోలీస్ విభాగాల అధికారులు, సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని తమ క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించారు. ఈ పోటీల్లో మహారాణిపేట సీఐ దివాకర్ యాదవ్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి షటిల్ సింగిల్స్ విభాగంలో విజేతగా నిలిచారు. మ్యాచ్ మొత్తం దివాకర్ యాదవ్ ఆత్మవిశ్వాసంతో, వేగవంతమైన రిఫ్లెక్సులతో, వ్యూహాత్మక ఆటతీరుతో ప్రత్యర్థులపై ఆధిపత్యం ప్రదర్శించారు. కీలక సందర్భాల్లో పాయింట్లు సాధిస్తూ ప్రేక్షకుల నుంచి ప్రశంసలు అందుకున్నారు. ఇక డబుల్స్ విభాగంలో కూడా ఆయన మరోసారి తన ప్రతిభను చాటారు. ఈస్ట్ ఏసీపీ లక్ష్మణమూర్తితో కలిసి బరిలోకి దిగిన సీఐ దివాకర్ యాదవ్ జోడీ అద్భుత సమన్వయం,




దూకుడు ఆటతీరుతో విజయం సాధించింది. ప్రత్యర్థి జోడీపై వరుస స్మాష్‌లు, కచ్చితమైన షాట్లతో ఆధిక్యం సాధిస్తూ మ్యాచ్‌ను తమవైపు తిప్పుకున్నారు. విజేతలుగా నిలిచిన సీఐ దివాకర్ యాదవ్‌ను నగర పోలీస్ కమిషనర్ ప్రత్యేకంగా అభినందించి షీల్డ్ మరియు మెడల్స్‌తో సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, పోలీస్ శాఖలో పనిచేసే అధికారులు శారీరక దృఢత్వం, మానసిక ఉల్లాసం కోసం క్రీడల్లో పాల్గొనడం ఎంతో అవసరమని తెలిపారు.అధికారులు కూడా మాట్లాడుతూ, విధి నిర్వహణలో ఉండే ఒత్తిడి నుంచి బయటపడటానికి ఇటువంటి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని, టీమ్ స్పిరిట్‌ను పెంపొందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని పేర్కొన్నారు. ఈ విజయంతో సీఐ దివాకర్ యాదవ్ ప్రతిభపై సహచర అధికారులు, సిబ్బంది ప్రశంసలు కురిపించారు. పోలీస్ విభాగంలో విధి నిర్వహణతో పాటు క్రీడల్లోనూ ఆయన చూపిన ప్రతిభ అందరికి ప్రేరణగా నిలిచిందని అభిప్రాయపడుతున్నారు.

# జీవీఎంసీ విలీనంపై సీఎం దే తుది నిర్ణయం : ఎమ్మెల్యే గంటా



**భీమిలి, సిటిజన్ టైమ్స్,ఏప్రియల్:15**

భీమిలి రూరల్, ఆనందపురం, పద్మనాభం మండలాలను జీవీఎంసీలో విలీనం చేసే ప్రతిపాదన ముఖ్యమంత్రి పరిశీలనలో ఉందని ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు తెలిపారు. మూడు మండలాలకు ప్రత్యేక జిల్లా పరిషత్ ఏర్పాటు సాధ్యం కాదని, ఇప్పటికే భీమిలి మండలంలోని కొంత భాగం జీవీఎంసీలో కలిసిందని చెప్పారు. భోగాపురం విమానాశ్రయం ప్రారంభంతో పద్మనాభం మండలం కూడా పట్టణీకరణ దిశగా అభివృద్ధి చెందుతుందని వివరించారు. మండలాల నాయకులు విలీనానికి అనుకూలంగా తీర్మానాలు చేసినట్లు తెలిపారు. 2011 జనగణన ప్రకారం విలీనం సాధ్యం కాదని, 2027 జనగణన తర్వాత అవకాశం ఉంటుందని అధికారులు సూచిస్తున్నారని పేర్కొన్నారు. సీఎం మార్గదర్శకత్వంలో తుది నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. వార్డుల పునర్విభజనలో భీమిలి జోన్‌లో వార్డులు 4 నుంచి 5కు, మధురవాడ జోన్‌లో 4 నుంచి 6కు పెంచే ప్రతిపాదన ఉందని తెలిపారు. కొమ్మాది నుంచి భోగాపురం వరకు మెట్రో విస్తరణ అవసరమని సూచించారు.

# అనకాపల్లి జిల్లా లో ఫస్ట్ ఇయర్ 12వ స్థానం, సెకండ్ ఇయర్ 13వ స్థానం : డీఐఈఓ వినోద్‌బాబు

**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :15**

రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో అనకాపల్లి జిల్లా గణనీయమైన ప్రదర్శన కనబరిచింది. ఫస్ట్ ఇయర్‌లో 12వ స్థానం, సెకండ్ ఇయర్‌లో 13వ స్థానం సాధించినట్లు జిల్లా ఇంటర్మీడియట్ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ డీఐఈఓ వినోద్‌బాబు తెలిపారు. ఫస్ట్ ఇయర్‌లో మొత్తం 10,315 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా, వారిలో 7,602 మంది ఉత్తీర్ణులై 74% పాస్ శాతం నమోదైంది. అలాగే సెకండ్ ఇయర్‌లో 9,926 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా, 7,829 మంది ఉత్తీర్ణులై 79% పాస్ శాతం నమోదు అయింది. జిల్లాలో విద్యార్థుల కృషి, ఉపాధ్యాయుల మార్గదర్శకత్వం, విద్యా ప్రమాణాల పెరుగుదల వల్ల ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని అధికారులు తెలిపారు. భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాల కోసం చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.



# గంజాయి కేసులో నిందుతుడు కి జైలు శిక్ష : ఎస్పీ తుహిన్ సిన్హా



**అనకాపల్లి, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :15**

నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2021లో నమోదైన గంజాయి అక్రమ రవాణా కేసులో నిందితుడికి విశాఖపట్నం 1వ అదనపు జిల్లా మరియు సెషన్స్ కోర్టు 4 సంవత్సరాల 9 నెలల కఠిన కారాగార శిక్షతో పాటు రూ.5,000 జరిమానా విధిస్తూ తీర్పు వెలువరించింది. జరిమానా చెల్లించని పక్షంలో అదనంగా ఒక నెల సాధారణ జైలు శిక్ష అనుభవించాలని న్యాయస్థానం పేర్కొంది. ఈ కేసులో నిందితుడిగా ఆకాష్ పాండురంగన్ (ఎ-3), వయస్సు 19 సంవత్సరాలు, తండ్రి పాండురంగన్, నివాసం పొన్నియమ్మన్ కోవిల్ వీధి, నరికుప్పం, బనవరం, వేలూరు జిల్లా, తమిళనాడు రాష్ట్రం ఉన్నాడు. 2021 జూలై 21న ఉదయం 9 గంటల సమయంలో అప్పటి ఎస్సై ఎస్. రమేష్‌కు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు నర్సీపట్నం రూరల్ పరిధిలోని నగరం గ్రామ శివారులో పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ సమయంలో అనుమానాస్పదంగా కనిపించిన వ్యక్తులు పోలీసులను చూసి తప్పించుకునే ప్రయత్నం చేయగా, సిబ్బంది వారిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద ఉన్న లగేజీ బ్యాగులను తనిఖీ చేయగా 10 కిలోల గంజాయి లభ్యమైంది. విచారణలో నిందితులు ఏజెన్సీ ప్రాంతం నుండి గంజాయిని కొనుగోలు చేసి తమిళనాడుకు తరలిస్తున్నట్లు అంగీకరించారు. ఈ కేసులో అప్పటి ఎస్సై ఎస్. రమేష్ సమగ్ర దర్యాప్తు జరిపి పక్కా సాక్ష్యాధారాలతో కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేశారు. కోర్టు విచారణలో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఖజానా రావు ప్రాసిక్యూషన్ తరపున బలమైన వాదనలు వినిపించారు. సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయస్థానం నేరం నిరూపితమైనట్లు తేల్చి శిక్షను ఖరారు చేసింది. ఈ తీర్పుపై జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా హర్షం వ్యక్తం చేస్తూ, పోలీసుల నిరంతర నిఘా, సమర్థవంతమైన దర్యాప్తు ఫలితంగా ఇలాంటి తీర్పులు వస్తున్నాయని పేర్కొన్నారు. కేసును విజయవంతంగా దర్యాప్తు చేసిన పోలీసు బృందం, ప్రాసిక్యూషన్ టీమ్ మరియు కోర్టు మానిటరింగ్ సెల్ సభ్యులను ఆయన అభినందించారు.

# కాశీబుగ్గ నూతన డీఎస్పీగా టి. భవాని

**శాంతి భద్రతలపై కట్టుదిట్టం: నూతన డీఎస్పీకి ఎస్పీ దిశానిర్దేశం**



**కాశీబుగ్గ, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 15:**

కాశీబుగ్గ సబ్‌డివిజన్ నూతన డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన టి. భవాని బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి, ఐపీఎస్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమె పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ భవానికి శుభాకాంక్షలు తెలుపుతూ, సబ్‌డివిజన్ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండి, వారి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. అలాగే నేరాల నియంత్రణ, మహిళల భద్రత, సైబర్ నేరాల నివారణపై కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, విజిబుల్ పోలీసింగ్‌ను మరింత బలోపేతం చేయాలని సూచించారు. గంజాయి వంటి మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టడంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎస్పీ ఆదేశించారు.

# ఇంటర్ ఫలితాలలో సత్తా చాటిన శ్రీకాకతీయ విద్యార్దులు

**కాకినాడ జిల్లా, రూరల్,సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 15**

ఈ రోజు విడుదలైన ఇంటర్ మొదటి రెండవ సంవత్సర ఫలితాలలో ప్రతిభ కనబరచి మండలంలో మొదటి స్థానంలో నిలిచారని బాలుర కంటే బాలికలే అత్యదిక మార్కులు సాదించారని ద్వితీయ సంవత్స రం ఎమ్ పి సి నుండి 984 మార్కులు సాధించి పెంకే శ్రీ లక్ష్మీ ( ఆర్యవటం)మండలం లోనే మొదటి స్థానంలో నిలిచిందని అలాగే మొదటి సంవత్సరం ఎమ్ పి సి నుండి కొప్పిశెట్టి మహాలక్ష్మి (గొర్రిపూడి)444 మార్కులు సాదించిందని బై పి సి చోడిశెట్టి లలిత (విజయరాయుడు పాలెం) 438 సాదించిందని అదేవిదంగా మొత్తంగా 89% పాస్ పర్సంటేజీని సాధించిందని గ్రామీణ ప్రాంతమైన గొల్లపాలెంలో ఇలాంటి మార్కులు సాధించటం అంత సులభం కాదని దీనికి విద్యార్దుల కృషి తల్లి తండ్రుల ప్రోత్సాహమే కారణమని కళాశాల అకడమిక్ ప్రిన్సిపాల్ ఎమ్ గంగాధర్ తెలియజేసారు ముత్తూట్ పిన్ కార్ప్ మేనేజర్ రాంబాబు విద్యార్దులను అభినందించారు. ఎ .ఒ .రాంబాబు,చక్రవర్తి, సుందర్ సింగ్ , అధ్యాపక బృందం తల్లితండ్రులు గ్రామపెద్దలు విద్యార్దులను అభినందించారు.



# ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత : ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి

**శ్రీకాకుళం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :15**

వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ కె.వి. మహేశ్వర రెడ్డి ఐపీఎస్ బుధవారం జి. సిగడాం పోలీసు స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణ, రికార్డులు, కేసు ప్రాపర్టీలను సమగ్రంగా పరిశీలించిన ఆయన, నిర్వహణ పకడ్బందీగా ఉండాలని సూచించారు. రిసెప్షన్ సెంటర్‌లో ప్రజా ఫిర్యాదుల నమోదు విధానం, వాటి పరిష్కార స్థితిని పరిశీలించిన ఎస్పీ, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందిస్తూ ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. దర్యాప్తులో ఉన్న పెండింగ్ కేసులపై సమీక్ష నిర్వహించి ఆలస్యానికి గల కారణాలను తెలుసుకుని విచారణను వేగవంతం చేయాలని సూచించారు. పోలీసు సిబ్బంది, ముఖ్యంగా మహిళా పోలీసుల విధి నిర్వహణపై కూడా ఆయన ఆరా తీశారు. గ్రామాల్లో జరుగుతున్న అనవసర ఘర్షణలు, అసాంఘిక కార్యకలాపాలపై అప్రమత్తంగా ఉండాలని, సమాచారం వెంటనే సంబంధిత ఎస్సైకి చేరేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 'నారీ శక్తి -- సంకల్పం' కార్యక్రమం ద్వారా మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్ప్రభావాలు, మహిళల భద్రత, సైబర్ నేరాలపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని ఎస్పీ సూచించారు. పాఠశాలలు, కళాశాలలు, గ్రామస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ యువతలో చైతన్యం పెంపొందించాలని తెలిపారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా వాహన తనిఖీలు కట్టుదిట్టం



చేయాలని, గంజాయి అక్రమ రవాణాను అరికట్టడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రాత్రి పహారా బలోపేతం చేసి అనుమానాస్పద వ్యక్తులపై నిరంతర నిఘా ఉంచాలని సూచించారు. ప్రతి రోజు గ్రామాల్లో పర్యటించి ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసుకోవాలని, చిన్నచిన్న వివాదాలను ప్రారంభ దశలోనే పరిష్కరించి పెద్ద సమస్యలుగా





మారకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఎస్పీ పేర్కొన్నారు. అదేవిధంగా స్టేషన్ పరిధిలో ముఖ్య కూడళ్ల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి నేర నియంత్రణలో సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించాలని, పెండింగ్ కేసుల విచారణను వేగవంతం చేయాలని ఆయన ఆదేశించారు. ఈ తనిఖీల్లో శ్రీకాకుళం టౌన్ డీఎస్పీ వివేకానంద, జె.ఆర్.పురం సీఐ అవతారం, ఎస్సై సందీప్‌తో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# ఇంటర్ ఫలితాల్లో వాసవి జూనియర్ కళాశాల విజయం



**పార్వతీపురం, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ : 15**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రకటించిన ఇంటర్మీడియట్ ఫలితాల్లో పార్వతీపురం పట్టణానికి చెందిన వాసవి జూనియర్ కళాశాల విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఘన విజయాలు సాధించారు. ఈ సందర్భంగా కళాశాల కరస్పాండెంట్ పి.వి.కే. మణికుమార్ మాట్లాడుతూ, తమ విద్యార్థులు ప్రతీ ఏడాదిలాగే ఈసారి కూడా అత్యుత్తమ ఫలితాలు సాధించి పట్టణంలో ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం ఎంపీసీ గ్రూపులో సి. హెచ్ . రాకేష్ 1000 మార్కులకు గాను 981 మార్కులు సాధించగా, బైపీసీ గ్రూపులో ఆర్ . యశస్విని 978 మార్కులు సాధించింది. అదే గ్రూపులో పి . హారిక, బి. చిన్ని తలో 977 మార్కులు సాధించి ప్రతిభ చూపారు.మొదటి సంవత్సరం ఫలితాల్లో ఎంపీసీ గ్రూపులో ఎస్. ఎం. నిఖిత 470 మార్కులకు గాను 465 మార్కులు సాధించి టౌన్ ఫస్ట్‌గా నిలిచింది. అదే గ్రూపులో కె. ఆర్. అమృత, వి . స్రవంతి తలో 461 మార్కులు, కె . విష్ణుప్రియ 460 మార్కులు



సాధించారు. బైపీసీ గ్రూపులో ఎ . దేవి 442 మార్కులు, జి . వినుష 441 మార్కులు, కె . రేష్మ 440 మార్కులు సాధించగా, సిఈసి గ్రూపులో ఎస్. జోత్స్న 500 మార్కులకు గాను 464 మార్కులు సాధించింది. ఈ విద్యా సంవత్సరంలో ద్వితీయ సంవత్సరంలో 900 పైగా మార్కులు సాధించిన విద్యార్థులు 56 మంది, ప్రథమ సంవత్సరంలో 400 పైగా మార్కులు సాధించిన వారు 69 మంది ఉన్నారని తెలిపారు. కళాశాల విద్యార్థులు అన్నింటా అత్యుత్తమ ఫలితాలు సాధించి అధిక ఉత్తీర్ణత శాతంతో ముందంజలో నిలిచారని ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబరిచిన విద్యార్థులను కళాశాల చైర్‌పర్సన్ పి. సరిత మరియు అధ్యాపక బృందం అభినందించారు.

# జనాభా గణన దేశాభివృద్ధికి కీలక ఘట్టం

## జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 15**



భారతదేశంలో 17 వ జనాభా గణన 2027ఒక చారిత్రాత్మక ఘట్టమనీ జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ అన్నారు.జిల్లాలో జరగనున్న 17వ విడత డిజిటల్ జనాభా గణన కార్యక్రమాన్నీ సమర్ధవంతంగా నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ ఆర్ మహేష్ కుమార్ తాసిల్దార్లు ఎంపీడీవోలు సాంకేతిక సహాయకులలతో టెలి కాన్ఫరెన్స్ బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జనాభా గణన ప్రక్రియను పారదర్శకంగా, ఖచ్చితంగా నిర్వహించేందుకు అవస రమైన సూచనలు చేస్తూ క్షేత్రస్థాయి వరకు దిశా నిర్దేశాలు అందించారు. జనాభా గణన 2027 సన్నద్ధతలో భాగంగా కీలక అంశాలపై అవగాహన కల్పించారు. ?డిజిటల్ విప్లవం ద్వారా స్వయం గణన మునుపెన్నడూ లేని విధంగా పౌరులు తమ వివరాలను ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా స్వయంగా నమోదు చేసుకునే స్వయం గణన' సౌకర్యాన్ని ప్రభుత్వం కల్పించిందని, దీనిపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. తాసిల్దార్లు ఎంపీడీవోలు క్షేత్రస్థాయిలో ఎన్యుమరే టర్ల నియామకం,శిక్షణ,పర్యవేక్షణ బాధ్యతలను కచ్చితంగా నిర్వర్తించాలన్నారు. డిజిటల్ డేటా నమోదులో తలెత్తే సాంకేతిక ఇబ్బందులను వెంటనే పరిష్కరించి, ప్రక్రియ సజావుగా సాగేలా చూడాలన్నారు. జనాభా గణన అనేది దేశాభివృద్ధికి కీలకమైన ప్రక్రియని, నిర్దేశించిన గడువులోగా వంద శాతం డేటా సేకరణ పూర్తి కావాలని స్పష్టం చేశారు. స్వయం గణన వల్ల సమయం ఆదా అవుతుందని,గోప్యత పాటింపబడుతుందని, ప్రజలకు వివరించాలని సూచించారు.?ప్రతి గ్రామం మరియు వార్డు స్థాయిలో మొబైల్ యాప్ వినియో గంపై సిబ్బందికి పూర్తి అవగాహన ఉండాలన్నారు. ఇంటర్నెట్ సదుపాయం తక్కువగా ఉన్న ప్రాంతాల్లో టెక్నికల్ అసిస్టెంట్లు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. ప్రతి గృహాన్ని కవరేజ్ చేస్తూ ప్రజల వివరాలను సక్రమంగా నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. డిజిటల్ విధానంలో సమాచార సేకరణ జరుగుతున్నందున, టాబ్లెట్లు, సాఫ్ట్‌వేర్ వినియోగంలో ఎలాంటి లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.జనాభా గణన ప్రక్రియలో పాల్గొనే ఎన్యుమరేటర్లు, సూపర్వైజర్లు తమ బాధ్య తలను నిబద్ధతతో నిర్వ హించాలని, ప్రజలకు అవగాహన కల్పిస్తూ సహకారం పొందాలని తెలిపారు., సమాచార భద్రత, గోప్యత విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు.

దేశంలోనే తొలి డిజిటల్ జనాభా గణనని గతంలో 2021లో జరగా ల్సిన ఈ ప్రక్రియ కోవిడ్ కారణంగా ఆలస్యమై, ఇప్పుడు అత్యాధునిక సాంకేతికతతో 2026- 27లో నిర్వహించ బడుతోందన్నారు.పూర్తి డిజిటల్ ప్రక్రియ ?ఈసారి జనాభా లెక్కల సేకరణలో కాగితం వాడకాన్ని తగ్గించి, మొబైల్ యాప్‌లను ఉప యోగిస్తున్నారన్నారు గణన అధికారులు తమ స్మార్ట్ ఫోన్ లేదా టాబ్లెట్‌ల ద్వారా నేరుగా వివరాలను నమోదు చేస్తారన్నారు. దీనివల్ల డేటా సేకరణ వేగంగా ఖచ్చితంగా జరుగుతుందన్నారు. స్వయం గణన ?ప్రజలు ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా లేదా ఎన్యుమరేటర్ కోసం వేచి చూడకుండా, తమ వివరా లను తామే ఆన్‌లైన్ పోర్ట ద్వారా నమోదు చేసుకోవ చ్చునన్నారు?తమ మొబైల్ నంబర్‌తో రిజిస్టర్ అయ్యి వివరాలు నింప వచ్చునన్నారు ?వివరాలు నమోదు చేశాక ఒక 16 అంకెల వస్తుందన్నారు . ఎన్యుమరేటర్ ఇంటికి వచ్చినప్పుడు ఈ ఐడి చూపిస్తే సరిపోతుందన్నారు.రెండు దశల ప్రక్రియ జనాభా గణన ప్రధానంగా రెండు దశల్లో జరుగుతుం దన్నారు? మొదటి దశ ఏప్రి ల్ - సెప్టెంబర్ 2026 గృహ గణన ఇందులో ఇంటి నంబర్, గోడలు,కప్పు ఏ మెటీరియల్‌తో కట్టారు, ఇంట్లో ఉన్న సౌకర్యాలు తాగునీరు, విద్యుత్, టాయిలెట్ వంటివి మరియు ఆస్తుల గురించి వివరాలు సేకరిస్తారన్నారు. రెండవ దశ ఫిబ్రవరి 2027జనాభా గణన. ఇందులో ప్రతి వ్యక్తి పేరు, వయస్సు, విద్య, వృత్తి, మతం మరియు కులం వంటి వ్యక్తిగత వివరాలను సేకరిస్తారన్నారు.కులగణన ఈ 17 వ జనాభా గణనలో ఒక ముఖ్యమైన మార్పు కుల గణన. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత మొదటి సారిగా పూర్తిస్థాయిలో కులాల వారీగా డేటాను సేకరించాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు.. ఇది సంక్షేమ పథకాల అమలు కు మరియు రిజర్వేషన్ల విధానాలకు కీలక ఆధారం కానుందన్నారు. తొలి దశ లో అడిగే ప్రశ్నలలో? ఇంటి యాజమాన్య స్థితి సొంత మా అద్దెదా,?తాగునీటి సౌకర్యం మరియు లభ్యత, వంట గ్యాస్ కనెక్షన్ ఉందా డిజిటల్ పరికరాలు స్మార్ట్ ఫోన్, ఇంటర్నెట్, లాప్‌టాప్ వాడుతున్నారా ?ప్రయాణ సాధనాలు సైకిల్,స్కూటర్, కారు వాడుతున్నది తెలుసుకోవాలన్నారు ఈ డిజిటల్ విధానం వల్ల సమాచారం అత్యంత గోప్యంగా ఉండటమే కాకుండా, విశ్లేషణ కూడా వేగంగా పూర్తయి ఫలి తాలు త్వరగా వెల్లడయ్యే అవకాశం ఉందన్నారు. జిల్లా యంత్రాంగం సమ న్వయంతో జనాభా గణనను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో అర్థగ ణాంకాధికారి మురళీకృష్ణ డిఆర్డిఏ, డ్వామా పిడి డి రాంబాబు తాసిల్దార్లు ఎంపీడీవోలు పాల్గొన్నారు.

# జనాభా గణన 2027 కార్యక్రమంలో భాగంగా ఇంటి జాబితా - గృహ గణన అవగాహన పత్రిక ఆవిష్కరణ



**ఉంగుటూరు:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రియల్ :15**

భారతదేశ జనాభా గణన 2027 కార్యక్రమంలో భాగంగా ఇంటి జాబితా మరియు గృహ గణనపై అవగాహన కల్పించే పత్రికను ఉంగుటూరు నియోజకవర్గ శాసనసభ్యులు పత్సమట్ల ధర్మరాజు ఉంగుటూరు శాసనసభ్యులక్యాంపు కార్యాలయం నందు ఈరోజు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రతి కుటుంబం జనాభా గణన కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని, ఎన్యూమరేటర్లు ఇంటికి వచ్చినప్పుడు సరైన మరియు పూర్తి సమాచారం అందించాలని పిలుపునిచ్చారు. జనాభా గణన ద్వారా సేకరించే సమాచారం దేశ అభివృద్ధి, ప్రణాళికల రూపకల్పనకు ఎంతో కీలకమని తెలిపారు. ప్రజలు తమ ఇంటి వివరాలు, వసతుల వివరాలను ఖచ్చితంగా ఇవ్వాలని సూచించారు. ఇచ్చే సమాచారం పూర్తిగా రహస్యంగా మరియు సురక్షితంగా ఉంచబడుతుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం చేపడుతున్న ఈ కార్యక్రమానికి ప్రజలు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఉంగుటూరు ఎమ్మార్వో , ఎంపిడిఓ మరియు సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# కాత్రేనికోనలో అన్న క్యాంటీన్ ప్రారంభం

**- పేదల సంక్షేమానికి కూటమి ప్రభుత్వ మరో అడుగు**





**కాత్రేనికోన సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 15**

కాత్రేనికోనలో అన్నా క్యాంటీన్ ప్రారంభించారు .ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, ముమ్మిడివరం శాసనసభ్యులు దాట్ల సుబ్బరాజు మాట్లాడుతూ కాత్రేనికోన మండల కేంద్రం కాత్రేనికోనలో అన్న క్యాంటీన్ ప్రారంభించడం ఎంతో ఆనందంగా ఉందని, పేద ప్రజలకు తక్కువ ధరలో నాణ్యమైన భోజనం అందించాలనే సంకల్పంతో కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోంది. కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రజల సంక్షేమానికి పెద్దపీట వేసిందని తెలిపారు. ముమ్మిడివరం ప్రధాన కేంద్రంలో ఇప్పటికే అన్న క్యాంటీన్ ప్రారంభించగా, ఇప్పుడు కాత్రేనికోనలో మరో క్యాంటీన్ ప్రారంభించడం ద్వారా పేదల ఆకలి తీర్చే దిశగా మరో ముఖ్యమైన అడుగు ముందుకు వేసిందని అన్నారు. అమలాపురం ఎంపీ గంటి హరీష్, బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు గుత్తుల సాయి ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పేదలకు అందుబాటులో తక్కువ ధరలో భోజనం అందించడం ద్వారా వారి జీవితాల్లో మార్పు తీసుకురావడం కూటమి ప్రభుత్వ లక్ష్యమని నాయకులు స్పష్టం చేశారు. భవిష్యత్తులో మరిన్ని ప్రాంతాల్లో అన్న క్యాంటీన్స్‌ను విస్తరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, స్థానిక ప్రజలు భారీగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# బిషప్ రూరల్ ఇంటిగ్రేటెడ్ మెడికల్ సెంటర్ ప్రారంభం....





**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 15:**

డా బి ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా, సఖినేటిపల్లి మండలం

ఆరోగ్య సేవలను అందరికీ చేరువ చేయాలనే లక్ష్యంతో హెల్త్ యాప్ ద్వారా డిజిటల్ ఆరోగ్య రంగంలో సమాజానికి సేవలుఅందించే విధంగా రూరల్ ఇంటిగ్రేటెడ్ మెడికల్ సెంటర్ ను రాజోలు నియోజకవర్గం సఖినేటిపల్లి గ్రామంలో ఏర్పాటు చేయటం జరిగింది. డా కృష్ణంరాజు రిబ్బను కత్తిరించి, ప్రారంభించారు. బిసమ్ ఫౌండేషన్ ఎండి బిసమ్ హరీష్ రెడ్డి మాట్లాడుతూ, పేద, నిరుపేదలకు ఆరోగ్య సేవలు, సహాయం అందించాలనే సదుద్దేశంతో 'బిసమ్ ఫౌండేషన్' అనే సేవా సంస్థను ఏర్పాటు చేశామని వివరించారు. ప్రజారోగ్యం పట్ల తమ నిరంతర నిబద్ధతకు నిదర్శనంగా, గ్రామంలో ఆయుర్వేద, అల్లోపతి చికిత్సా పద్ధతులను సమ్మిళితం చేస్తూ ఒక సమగ్ర ఆరోగ్య కేంద్రాన్ని ప్రారంభించడం తమకు ఎంతో గర్వకారణమని తెలియజేశారు. ఈ కేంద్రం గ్రామీణ, పట్టణ ప్రాంత ప్రజలకు సంపూర్ణమైన అందుబాటు ధరల్లో ఆరోగ్య సేవలను అందించాలనే ప్రధాన లక్ష్యంతో రూపొందించబడిందని తెలిపారు. ఇందులో భాగంగా దేశవ్యాప్తంగా 'రిమ్స్' పేరుతో 100 శాఖలను ఏర్పాటు చేయడానికి సన్నద్ధమవుతున్నట్లు తెలియాజేశారు. అత్యాధునిక కృత్రిమ మేధస్సు సాంకేతికతను వినియోగించి, రోగికి ఎలాంటి పరీక్షలు అవసరమో ద్వారా గుర్తించి, దానికనుగుణంగా చికిత్స అందించబడుతుందని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో డైరక్టర్ జయంతి, గుబ్బల ఫణి కుమార్, సర్పంచ్ చిట్టిబాబు, నామన నాగ భూషణం, శ్రీను, శేష ప్రసాద్, మాస్టారు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొని, ఉచిత చికిత్స, ఉచిత మందులు అందచేశారు.

## ఖతార్ లో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు...



**సఖినేటిపల్లి సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 15**

భారత రాజ్యాంగ నిర్మాత డా. బి. ఆర్ అంబేద్కర్ 135 జయంతి వేడులను గల్ఫ్ దేశం ఖతార్ రాజధాని దోహాలో ప్రవాసాంధ్రులు బుధవారం ఘనంగా నిర్వహించారు. భిషప్ ఓగూరి బుల్లబ్బాయి ముఖ్య అతిధిగా పాల్గొని, రాజోలు నియోజకవర్గంనకు చెందిన తెలుగు ప్రజలంతా దోహ తాజ్ మహారాజ్ హోటల్ లో సమావేశం ఏర్పాటు చేసుకొని అంబేద్కర్ జయంతిని నిర్వహించారు. అంబేద్కర్ అందించిన స్వేచ్ఛా స్వతంత్రతో మేము విదేశాల్లో పనిచేసు కొంటున్నామని వైస్సార్ సీపీ గల్ఫ్ కన్వీనర్ దొండపాటి శశి కిరణ్ అన్నారు. విదేశాల్లో డా. బి ఆర్ అంబేద్కర్ పేరు చెబితే ఎనలేని గౌరవం లభిస్తుందని, అయన ఖ్యాతి ఖండాంతరం అన్నారు. విశ్వం అయనను కీర్తిస్తుందన్నారు. దోహా అంబేద్కర్ గ్రూప్ ఖతార్ కమిటీ ఆధ్వర్యంలో నల్లి కిషోర్, అకుమర్తి ప్రకాశ్, గంటా ప్రసాద్, గోసంగి రాజు, పశ్చిమాల సతీష్ , సాయి కృష్ణల సమన్వయంతో ఈ కార్యక్రమం జరిపించినందుకు పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో మండా వర్జిల్ బాబు, నల్లి నాగేశ్వరరావు, కర్రి లక్ష్మయ్య, వర్ధనపు ప్రకాశ్, గెడ్డం చంటి ,పితాని శ్రీను, హేమంత్ నారిమ్, నల్లి ప్రసాద్ పాల్గొన్నారు.

## కాకినాడ పోర్టు వద్ద పీడీఎస్ బియ్యం అక్రమ ఎగుమతి బహిర్గతం

**910 టన్నుల బాయిల్డ్ రైస్ సీజ్...**

**రూ.3.54 కోట్ల విలువ**

**కాకినాడ, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 15**

కాకినాడ యాంకరేజ్ పోర్టు పరిసరాల్లో పీడీఎస్ బియ్యం అక్రమ ఎగుమతి వ్యవహారం వెలుగులోకి వచ్చింది. రాష్ట్ర పౌర సరఫరా కార్పొరేషన్ చైర్మన్ తోట సుధీర్ ఆధ్వర్యంలో పౌర సరఫరా, రెవెన్యూ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన తనిఖీల్లో భారీ స్థాయిలో అవకతవకలు బయటపడ్డాయి. పోర్టు సమీపంలో భార్జీలు, రైల్వే వ్యాగన్‌లలో నిల్వ ఉన్న బియ్యాన్ని పరిశీలించిన అధికారులు, చెక్‌పోస్ట్ రిజిస్టర్లను క్షుణ్ణంగా పరిశీలించారు. బాయిల్డ్ రైస్, రా రైస్, రా బ్రోకెన్స్ ఎగుమతి విధానంపై వివరాలు సేకరించారు. టెక్నికల్ సిబ్బంది నమోదు చేసిన రికార్డులను సమీక్షించి సూచనలు ఇచ్చారు. తదుపరి మానస ఎంటర్‌ప్రైజెస్ గోదాం, స్వార్టెక్స్ ప్లాంట్లు, ఎన్‌డీఆర్ గోదాం, చిత్ర ఆగ్రో ఎగ్జిట్స్, కొవ్వూరి ఆనంద్ రెడ్డి నిర్వహిస్తున్న సార్టెక్స్ యూనిట్‌లలో తనిఖీలు చేపట్టారు. అక్కడ 10 లారీలలో బియ్యం నిల్వ ఉన్నట్లు గుర్తించారు. శాంపిల్స్‌ను పరీక్షించగా బాయిల్డ్ రైస్‌లో ఫోర్టిఫైడ్ కెర్నల్స్ ఉన్నట్లు తేలింది. సాధారణంగా ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా సరఫరా చేసే బియ్యంలోనే ఇవి ఉంటాయని అధికారులు తెలిపారు. మిల్‌లోనూ ఇదే రకం బియ్యం నిల్వ ఉన్నట్లు నిర్ధారించారు. విచారణలో, ఒడిశా, కర్ణాటక, తెలంగాణ రాష్ట్రాల నుంచి తక్కువ ధరకు పీడీఎస్ బియ్యాన్ని కొనుగోలు చేసి, అక్రమంగా విదేశాలకు ఎగుమతి చేస్తున్నట్లు బయటపడింది. భారీగా సీజ్ ఈ చర్యల్లో భాగంగా మొత్తం 910 టన్నుల బాయిల్డ్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. 10 లారీలలో 260 టన్నులు ప్లాంట్‌లో 650 టన్నులు మొత్తం విలువ సుమారు రూ.3.54 కోట్లు ఉండగా, ఇందులో లారీల బియ్యం విలువ రూ.1 కోటి వరకు ఉంటుందని అధికారులు తెలిపారు. జిల్లా పౌర సరఫరా అధికారి రుద్రరాజు సత్యనారాయణ రాజు తెలిపిన వివరాల ప్రకారం, అనాలసిస్ రిపోర్టుల కోసం నమూనాలు పంపించారు. పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేసి ఎగుమతి చేయడం నేరమని, బాధ్యులపై చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని అధికారులు స్పష్టం చేశారు.



## రూ. 75.75 లక్షల వ్యయంతో ఆధునిక అగ్నిమాపక వాహనం ప్రారంభించిన మంత్రి సుభాష్

**అగ్ని మాపక వారోత్సవాలపై ప్రజలు అవగాహన పెంపొందించుకోవాలి.**

**రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్**




**రామచంద్రపురం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 15::**

అగ్ని ప్రమాదాల సమయంలో రక్షణ కోసం రాష్ట్ర విపత్తు స్పందన, అగ్నిమాపక శాఖ ఏర్పాటుచేసిన అడ్వాన్స్ ఫైర్ టెండర్ వాహనాన్ని రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ బుధవారం జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం నూతన వాహనం ఎక్కి ప్రయాణించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ అగ్నిప్రమాదాల నివారణలో ఫైర్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని తెలిపారు. ప్రజల ప్రాణాలు, ఆస్తులను రక్షించడంలో ఈ ఆధునిక ఫైర్ టెండర్ వాహనం ఎంతో ఉపయోగ పడుతుందని చెప్పారు. ఏప్రిల్ 14 నుండి 20 వరకు అగ్నిమాపక వారోత్సవాలు నిర్వహిస్తున్న నేపథ్యంలో ప్రజల్లో అవగాహన పెంచడం ముఖ్యమని పేర్కొన్నారు. ఈ కొత్త వాహనంలో ద్వారా 105 గ్రామాలకు అగ్నిమాపక వాహన సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. ఈ వాహనంలో అత్యాధునిక పరికరాలు ఏర్పాటు చేయబడినట్లు తెలిపారు. హై ప్రెజర్ పంపు, 360 డిగ్రీస్ మానిటర్, హైడ్రాలిక్ టూల్స్ వంటి ఆధునిక సదుపాయాలతో పాటు, హోసులు, లాడర్లు, కట్టర్లు, డ్రిల్ మెషీన్లు వంటి అత్యవసర సామగ్రి అందుబాటులో ఉంచినట్లు చెప్పారు. అదేవిధంగా షార్ట్ సర్క్యూట్లు, గ్యాస్ లీకేజీలు, ఫ్యాక్టరీ ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు వంటి వివిధ అత్యవసర పరిస్థితుల్లో వేగంగా స్పందించేందుకు ఈ వాహనం సహాయపడుతుందని తెలిపారు. ప్రజలు అగ్నిప్రమాదాల సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ఎలక్ట్రిక్ లైన్లు, గ్యాస్ సిలిండర్లు, పెట్రోలు పదార్థాలు,ఎల్పిజి స్టౌలు, వెల్డింగ్ పనులు, పటాకులు వంటి అంశాల్లో జాగ్రత్తలు పాటించాలని మంత్రి సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎన్ పార్థసారథి, రామచంద్రపురం అగ్నిమాపక అధికారి కె వెంకటరెడ్డి, ముమ్మిడివరం ఫైర్ అధికారి ఎస్ నాగేశ్వరరావు, జనసేన ఇన్చార్జి పోలిశెట్టి చంద్రశేఖర్, పట్టణ టిడిపి అధ్యక్షులు ఉండవెల్లి శివ, ఉపాధ్యక్షులు చందమామ వాసు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అప్ గ్రేడ్ చేయడానికి కృషి...

**పేదలకు కార్పొరేట్ వైద్యం అందించే విధంగా ఆసుపత్రి అభివృద్ధి...**

**కొత్తపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్లో రూ.50 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు...**

**ఆసుపత్రి ముందు షెల్టర్ నిర్మాణానికి రూ.రూ.7లక్షల స్వంత నిధులు వెచ్చించిన ఎమ్మెల్యే బండారు...**



**రావులపాలెం, సిటిజన్ టైమ్స్, ఏప్రిల్ 15:**

కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిని పేద మరియు మధ్యతరగతి ప్రజలకు కార్పొరేట్ స్థాయి వైద్యసేవలు అందించే విధంగా అభివృద్ధి చేయడం తమ లక్ష్యమని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు తెలిపారు. బుధవారం ఆయన కొత్తపేట కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో సుమారు రూ.50 లక్షలతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఆసుపత్రిలో సమగ్ర ఆధునీకరణ పనులు చేపట్టినట్లు తెలిపారు. పురుషుల మరియు స్త్రీల వార్డులకు సీలింగ్ ఏర్పాటు చేసి, నూతన ఫ్యాన్లు అమర్చినట్లు చెప్పారు. మరుగుదొడ్లలో పూర్తిగా పాడైన ప్లంబింగ్ వ్యవస్థను తొలగించి, ఆధునిక సదుపాయాలతో పునర్నిర్మాణం చేసినట్లు వెల్లడించారు.రోగుల సౌకర్యార్థం మంచాలు, పరుపులు మార్పు చేసి, చిన్నపిల్లల వార్డులో బేబీ వార్మర్స్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. పాత కిటికీల స్థానంలో కొత్త యూపీవీసీ ఓపెన్ విండోలను ఏర్పాటు చేయడం, వేసవికాలాన్ని దృష్టిలో ఉంచుకుని మూడు వాటర్ కూలర్లను ఏర్పాటు చేయడం, ఆసుపత్రి పరిసరాల్లో పచ్చదనం పెంచేందుకు మొక్కలు నాటడం వంటి పనులు చేపట్టినట్లు చెప్పారు. అదనంగా, అస్తవ్యస్తంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను పూర్తిగా మార్చి అండర్ గ్రౌండ్ డ్రైనేజీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.శానిటేషన్ విషయంలో ఎక్కడా రాజీపడబోమని, ఆసుపత్రి పరిశుభ్రతకు పారిశుధ్య కార్మికులు కీలకమని ఎమ్మెల్యే తెలిపారు. ఆసుపత్రి అభివృద్ధిలో నిరంతరం పర్యవేక్షణ చేస్తూ సహకారం అందిస్తున్న ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కంఠంశెట్టి శ్రీనివాస్, పల్లికొండ సుధీర్ కుమార్, చిట్టూరి లక్ష్మి సేవలను అభినందించారు.ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ జి. దుర్గాప్రసాద్ మాట్లాడుతూ, ఆసుపత్రి అభివృద్ధికి ఎమ్మెల్యే బండారు సత్యానందరావు గారి సహకారం మరువలేనిదని తెలిపారు. ఏ సమస్యను తెలియజేసినా వెంటనే స్పందించి పరిష్కారం చూపుతున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు.

**వంద పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయడానికి కృషి...**

కొత్తపేట ప్రభుత్వ ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా అభివృద్ధి చేయడానికి అన్ని విధాలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. 1999లో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ఈ ఆసుపత్రి 50 పడకల ఆసుపత్రిగా అప్‌గ్రేడ్ చేయబడిందని గుర్తుచేశారు.ఇటీవల చేపట్టిన అభివృద్ధి పనులతో ఆసుపత్రి కార్పొరేట్ స్థాయికి చేరువవుతోందని, రోగులకు అవసరమైన అన్ని సౌకర్యాలు, మందులు అందుబాటులో ఉంచుతున్నామని చెప్పారు. తన సొంత నిధులతో రూ.7 లక్షల వ్యయంతో ఆసుపత్రి ముందు షెల్టర్ నిర్మించినట్లు తెలిపారు.ఆసుపత్రి అభివృద్ధి కోసం కమిటీ సభ్యులు, వైద్యులు సమిష్టిగా కృషి చేస్తున్నారని, ప్రజలకు మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు నిరంతరం ప్రయత్నాలు కొనసాగిస్తామని ఎమ్మెల్యే బండారు సత్యానందరావు స్పష్టం చేశారు.

## పేదవాడి ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్ ప్రారంభం..





**రాజోలు సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ 15**

అంబేద్కర్ కోనసీమ జిల్లా, రాజోలు నియోజకవర్గ కేంద్రంలో నిరుపేదల ఆకలి తీర్చేందుకు ఉద్దేశించిన అన్న క్యాంటీన్‌ను బుధవారం అత్యంత వైభవంగా ప్రారంభించారు. ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్, ఇంచార్జ్, రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్లపల్లి అమూల్య కలిసి రిబ్బన్ కట్ చేసి, అన్నా కేంద్రాన్ని ప్రజలకు అంకితం చేశారు. ఎమ్మెల్యే దేవ వర ప్రసాద్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం నిలిపివేసిన ఈ అద్భుత పథకాన్ని కూటమి ప్రభుత్వం మళ్ళీ ప్రజల ముందుకు తీసుకురావడం శుభపరిణామమని అన్నారు. నిరుపేదలు, కూలీలు, మార్కెట్‌కు వచ్చే సామాన్యులకు కేవలం 5 రూపాయలకే నాణ్యమైన భోజనాన్ని అందించడమే ఈ పథకం లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. రాష్ట్ర అధికార ప్రతినిధి గొల్లపల్లి అమూల్య మాట్లాడుతూ, ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా రాజోలులో అన్న క్యాంటీన్ ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆకలి లేని సమాజం కోసం ప్రభుత్వం అడుగులు వేస్తోంది. సామాన్యుడి కడుపు నింపే ఈ క్యాంటీన్లను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి" అని ఆమె కోరారు. ఎమ్మెల్యే దేవ, అమూల్య స్వయంగా వడ్డన చేసి, ప్రజలతో కలిసి భోజనం చేశారు. ?ఆహార నాణ్యతను పరిశీలించి, నిర్వాహకులకు తగు సూచనలు చేశారు. ?ఈ కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. ?రాజోలు నడిబొడ్డున అన్న క్యాంటీన్ ప్రారంభం కావడంతో స్థానిక ప్రజలు, ముఖ్యంగా నిత్యం పనుల కోసం వచ్చే కూలీలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## అన్నార్తుల ఆకలి తీర్చే అన్న క్యాంటీన్ ప్రారంభం

**కొత్తపేటలో అన్నా క్యాంటీన్ ప్రారంభించిన ఎమ్మెల్యే బండారు సత్యానందరావు**

**మొదటిరోజు భోజనాల అయ్యేఖర్చును మొత్తం విరాళంగా ఇచ్చిన బండారు సందీప్**



**కొత్తపేట సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 15**

కొత్తపేటలో అన్నార్తుల ఆకలను తీర్చే అన్న క్యాంటీన్ కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు రాష్ట్ర బీసీ కార్పొరేషన్ చైర్మన్ రెడ్డి ఆనంద్ కుమారీ తో కలిసి ప్రారంభించారు. కూడు ,గుడ్డ, ఇల్లు పేదవారికి అందించాలన్నది తెలుగుదేశం పార్టీ మూల సిద్ధాంతం పేదవారికి పట్టెడ అన్నం పెట్టాలన్నది అన్న నందమూరి తారక రామారావు ఆశయంఆయన ఆశయాలకు ఆలోచనలకు అనుగుణంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ఐదు రూపాయలకే అన్నం పెట్టే అన్నా క్యాంటీన్ లు ప్రారంభించారు. గత ప్రభుత్వం అన్న క్యాంటీన్ మూసివేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో 205 అన్న క్యాంటీన్ లను తిరిగి పునరుద్ధించారు. ఇప్పుడు మరలా ఈరోజు 62 అన్న క్యాంటీన్ కేంద్రాలను ప్రారంభించారు. అందులో భాగంగా కొత్తపేటలో ఈరోజు ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్న క్యాంటీన్ ప్రారంభించారు. మొదటిరోజు భోజనాలకు అయ్యే ఖర్చు మొత్తం బండారు సత్యానందరావు తనయుడు బండారు సందీప్ విరాళంగా అందించారు. కొత్తపేట ముఖ్య కూడలి బస్టాండ్ సెంటర్ లో ప్రభుత్వాసుపత్రికి దగ్గరగా అందరికీ అందుబాటులో ఉండే ప్రదేశంలో ఈ అన్నా క్యాంటీన్ ప్రారంభించడం ప్రజలకు చాలా ఉపయోగకరం కానుంది. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పొదిలిలో ఈనెల 18న ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం

**పొదిలి, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 15**

పొదిలిలో ఈనెల 18న తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్లు హబీబుల్లా ఫౌండేషన్ చైర్మన్ కరిముల్లా బేగ్ చెప్పారు. పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో శనివారం నాడు ప్రముఖ ఆయుర్వేద వైద్యులు జోషి రాజేష్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడేవారు ఉచిత వైద్య శిబిరంలో అవసరమైన చికిత్సలు పొందవచ్చని కరీముల్లా బేగ్ చెప్పారు. షుగర్, బిపి, ఎలర్జీ వంటి సమస్యలకు వైద్యులు ప్రత్యేకంగా చికిత్సలు అందించడం జరుగుతుందన్నారు.

## నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవనికి దద్దాలకు ఆహ్వానిస్తున్న గ్రామస్తులు..

నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొనాలని దద్దాలకు ఆహ్వానించిన గ్రామస్తులు..





**పామూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 15**

మండలంలోని దూబగుంట పంచాయతీ కొత్తపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ కోదండ రామాలయం ఈ నెల 23వ తేది గురువారం శ్రీమత్ గణపతి సహిత, శ్రీ లక్ష్మీదేవి సహిత,సీతా లక్ష్మణ హనుమత్ సమేత శ్రీ రామచంద్రస్వామి నూతన విగ్రహ ప్రతిష్టా మహోత్సవం సందర్భంగా బుధవారం కనిగిరి నియోజకవర్గ వైఎస్సార్సీపీ ఇంచార్జి దద్దాల నారాయణ యాదవ్ ను ఆయన నివాసంలో కమిటీ సభ్యులు మర్యాద పూర్వకంగా కలిసి ఆహ్వాన పత్రిక అందజేసి, ఆహ్వానించారు. శ్రీకంఠం వెంకట రమేష్ బాబు, రేగలగడ్డ నాగరాజు, కొప్పోలు సంజీవరెడ్డి, కోటపాటి హజరత్ రెడ్డి, చింతలపూడి మల్లికార్జున్ రెడ్డి, కోటపాటి రామకృష్ణ రెడ్డి, మితికాల బాలకృష్ణ తదితరులు ఆహ్వానించిన వారిలో ఉన్నారు.

## ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో క్యాంపస్ డ్రైవ్



**మార్కాపురం, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 15**

స్థానిక ఇందిరా ఇంజనీరింగ్ కళాశాలలో ప్రముఖ సంస్థలైన టాటా ఎలక్ట్రానిక్స్, లాజిక్ వైల్ కంపెనీ ఆధ్వర్యంలో క్యాంపస్ డ్రైవ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి టాటా ఎలక్ట్రానిక్స్ నుండి ఎన్. రామకృష్ణ (సి.పి టాలెంట్ అక్విజిషన్ హెడ్, ఆంధ్రప్రదేశ్), లాజిక్ వైల్ కంపెనీ ఫౌండర్ అండ్ సీఈఓ కె.వి. శ్రీనివాస్ హాజరై విద్యార్థులతో పరస్పర చర్యలు నిర్వహించారు. ఈ క్యాంపస్ డ్రైవ్ ద్వారా మొత్తం 18 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. ఈ కార్యక్రమంలో కళాశాల చైర్మన్ వెన్నా హనుమా రెడ్డి , డైరెక్టర్ డా. పి. శంకర్ బాబు , ప్రిన్సిపాల్ డా. చి. శ్రీధర్, వైస్ ప్రిన్సిపాల్ డా. బి. బాల సుబ్బన్న , అకాడమిక్ అడ్మినిస్ట్రేషన్ డీన్ పి. శివకుమార్ , అకాడమిక్ డీన్ డా. పి. చంద్రరేఖ విద్యార్థులను అభినందించారు.

## గిద్దలూరులో జనగణన శిక్షణ ప్రారంభం

### ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు అవగాహన




**గిద్దలూరు, సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 15**

దేశవ్యాప్తంగా కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జనగణ కార్యక్రమంలో భాగంగా బుధవారం గిద్దలూరు స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు మొదటి బ్యాచ్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఇన్చార్జ్ ఆఫీసర్ ఆంజనేయ రెడ్డి, అదనపు చార్జ్ ఆఫీసర్ ఎంపీడీవో సీతారామయ్య ప్రారంభించారు. మూడు రోజుల పాటు జరిగే ఈ శిక్షణలో భాగంగా మొదటి రోజు ఫీల్డ్ ట్రైనర్లు ఎం. బాల గురవయ్య, సి. రామచంద్రారెడ్డి జనగణన సర్వే నిర్వహణ విధానంపై ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లకు వివరంగా అవగాహన కల్పించారు. ప్రతి ఇంటిని సందర్శించి, గృహ యజమానులకు నమోదు చేయవలసిన అంశాలను స్పష్టంగా తెలియజేయాలని సూచించారు. జనగణనలో ప్రతి వివరాన్ని జాగ్రత్తగా నమోదు చేయడం అత్యంత ముఖ్యమని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు, చార్జ్ ఆఫీసర్ ఎం. ఆంజనేయ రెడ్డి, ఎంపీడీవో సీతారామయ్య, ఏఎస్ఓ ఎండి ఫరీదా సుల్తానా బేగం, ఆర్. భాస్కరరావు, ఫీల్డ్ ట్రైనర్లు బాల గురవయ్య, రామచంద్రారెడ్డి, ఎన్యూమరేటర్లు, సూపర్వైజర్లు తదితరులు పాల్గొన్నారు.

## అమరావతిపై విషం చిమ్మితే

# రాష్ట్రంలో వైసిపి కనుమరుగు



- జగన్ తీరు 'ముత్యాలముగ్గు' సినిమాలో రావుగోపాలరావులా ఉంది
- జగన్ చుట్టూ చిడతల భజన బృందం.. అంతా మావిగాన్ అంటూ రోత పలుకులు పలుకుతున్నారు
- అమరావతి రాజధానిని జగన్ అపహాస్యం చేస్తున్నాడు
- విజయవాడ అభివృద్ధిని అడ్డుకున్నది నా గురించి మాట్లాడే వైసిపి నాయకులే
- బియ్యం మాఫియాకు అడ్డా గుణదలలో వైసిపి నాయకుడి దొడ్డే
- సుజనా చౌదరి నాకు రాజకీయ గురువు వంటి వారు
- సుజనా ఫోన్ ట్యాపింగ్ ఆరోపణలు నిరూపించకపోతే సాక్షిపై చట్టపరమైన చర్యలు తప్పవు
- కేంద్ర ప్రభుత్వం మహిళా బిల్లు, నియోజకవర్గాల డీ లిమిటేషన్ బిల్లులు పెట్టే సమయంలో ఎంపీగా లోక్ సభలో ఉండటం నాకు గర్వంగా ఉంది
- తిరువూరు నియోజకవర్గంకు చెందిన టిడిపి నాయకుల శ్యావల దేవదత్, ఎనఆరఐ వల్లభనేని గిరిబాబులతో ఎటువంటి ఆర్థిక లావాదేవీలు లేవు
- తనపై వస్తున్న ఆరోపణలు అన్నీ అవాస్తవాలు
- విలేకరుల సమావేశంలో విజయవాడ పార్లమెంటు సభ్యులు కేశినేని శివనాథ్ (చిన్ని )

**విజయవాడ:( సిటిజన్ టైమ్స్ ): ఏప్రియల్ :15:**

మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి, వైకాపా నాయకుల తీరుపై విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాజధాని అమరావతిని 'మావిగన్' అని సంబోధిస్తూ జగన్ అపహాస్యం చేయడం ఆయన అహంకారానికి పరాకాష్ట అని విమర్శించారు . బుధవారం విజయవాడలోని గురునానక్ కాలనీలో గల తన కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జగన్మోహన్ రెడ్డి వ్యవహారశైలి 'ముత్యాలముగ్గు' సినిమాలో రావుగోపాలరావు పాత్రను తలపిస్తోందని, ఆయన ఏం మాట్లాడినా 'తానా అంటే తందానా' అనే చిడతల భజన బృందం చుట్టూ చేరిందని ఎద్దేవా చేశారు . అమరావతిని, ప్రజలను అవమానించేలా జగన్ నోటి వెంట వస్తున్న రోత పలుకులను రాష్ట్ర ప్రజలంతా గమనిస్తున్నారని హెచ్చరించారు . విజయవాడలో కార్పొరేటర్ గా కూడా గెలవలేని ఓ నాయకుడు తమపై విమర్శలు చేయడం హాస్యాస్పదమని, గతంలో మీ తండ్రి తెలుగుదేశం పార్టీ గురించి, అమరావతి గురించి ఏం మాట్లాడారో ఒక్కసారి గుర్తు చేసుకోవాలని గుణదల వైసిపి నాయకుడికి హితవు పలికారు. విజయవాడ, గుంటూరు నగరాల అభివృద్ధికి అమరావతి ప్రాణాధారమని, కానీ గత ప్రభుత్వం దీన్ని నిర్వీర్యం చేసిందని ఎంపీ విమర్శించారు . గుణదల ఫ్లై ఓవర్ నిర్మాణాన్ని అడ్డుకుని ప్రజలకు ఇబ్బందులు కలిగించింది వైకాపా నాయకులేనని, తాము అధికారంలోకి వచ్చిన త్వరలోనే ఆ పనులను పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు . నగరంలో బియ్యం మాఫియాను ప్రోత్సహిస్తున్నది ఎవరో అందరికీ తెలుసని, దమ్ముంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్పొరేటర్లను గెలిపించుకోవాలని సవాల్ విసిరారు. తిరువూరు నియోజకవర్గ అభివృద్ధికి తెలుగుదేశం ప్రభుత్వం కట్టుబడి ఉందని, వందల కోట్ల రూపాయలతో త్వరలోనే నియోజకవర్గ అభివృద్ధి కోసం ప్రాజెక్టులు ప్రారంభిస్తామని చిన్ని స్పష్టం చేశారు. తిరువూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శ్యావల దేవదత్ నుంచి తాను డబ్బులు తీసుకున్నట్లు వస్తున్న ఆరోపణలను ఎంపీ శివనాథ్ ఆయన తీవ్రంగా ఖండించారు . గత ఎన్నికలకు ముందు నుంచే తిరువూరు ఇన్‌ఛార్జిగా దేవదత్ ఉన్నారని, దేవదత్ ప్రజలకు సేవ చేసేందుకు సొంత నిధులు ఖర్చు పెట్టారని ఆయనతో ఒక్క రూపాయి కూడా లావాదేవీ తనకు లేదన్నారు. కొందరు నాపై బురద జల్లేందుకు ఓ ఛానల్, ఓ పత్రిక ద్వారా ప్రయత్నాలు చేస్తున్నారని, ఒకవేళ దేవదత్ నుంచి ఎవరైనా డబ్బులు తీసుకుంటే అది పాత ఎంపీ (కేశినేని నాని) అయి ఉండవచ్చని ఎద్దేవా చేశారు . ఎన్నికల సమయంలో పార్టీ విజయం కోసం కృషి చేసిన ఎన్ ఆర్ ఐ గిరితో కూడా తనకు ఎటువంటి ఆర్థిక లావాదేవీలు లేవని స్పష్టం చేశారు . తిరువూరులో గత ఎన్నికలలో ఎంపీ, ఎమ్మెల్యేల గెలుపు కోసం వల్లభనేని గిరి పనిచేశారని, ఆయనకు పార్టీ పరంగా సలహాలు ఇచ్చానే తప్ప ఒక్క రూపాయి కూడా తీసుకోలేదన్నారు. గత ఎన్నికలకు ముందు నుంచే నియోజకవర్గ వ్యాప్తంగా నా సొంత డబ్బుతో అనేక సేవా కార్యక్రమాలను చేపట్టానని, ఒకరి దగ్గర డబ్బులు తీసుకోవాల్సిన అవసరం నాకు ఉండదని స్పష్టం చేశారు. తన ఆసుపత్రి ఆర్థిక ఇబ్బందుల్లో ఉందని దేవదత్ ఒకసారి తన వద్దకు వచ్చి చెప్తే తాను కూడా ఆర్థిక సహాయం చేస్తానని చెప్పానే తప్ప ఒక్క రూపాయి తీసుకోలేదన్నారు. వైకాపా పత్రిక 'సాక్షి' నిరంతరం అబద్ధపు వార్తలతో తనపై విషం చిమ్ముతోందని ఎంపీ ఆగ్రహం వ్యక్తం చేశారు . తన రాజకీయ గురువు, మార్గదర్శి అయిన కేంద్ర మంత్రి సుజనా చౌదరి ఫోన్‌ను తాను ట్యాప్ చేసినట్లు రాసిన వార్తలో కనీసం నిజం లేదన్నారు . దీనిపై ఇప్పటికే సాక్షి పత్రికపై ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియాకు ఫిర్యాదు చేశామని, ధైర్యముంటే ఆధారాలు బయటపెట్టాలని సాక్షి యాజమాన్యంను సవాల్ చేశారు. అమరావతి చట్టబద్ధత బిల్లుతో పాటుగా రేపు పార్లమెంటులో ప్రవేశ పెట్టనున్న మహిళా బిల్లు, డీ లిమిటేషన్ బిల్లుల సమయంలో తాను ఎంపీగా ఉన్నందుకు ఎంతో గర్వంగా ఉందని ఎంపీ కేశినేని శివనాథ్ అన్నారు. మహిళాభ్యున్నతికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టుబడి ఉన్నాయని, ఆ క్రమంలోనే మహిళా బిల్లును ప్రవేశ పెడుతున్నారన్నారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ నేతృత్వంలో యువనేత నారా లోకేష్ నాయకత్వంలో 2047 నాటికి 'వికసిత ఆంధ్రప్రదేశ' సాధనే లక్ష్యంగా తాము ముందుకు సాగుతున్నామని ఆయన పేర్కొన్నారు .

## క్షేమంగా చేరుకోవడమే గమ్యం...

## వేగం కాదు ప్రాణమే ముఖ్యం : హర్ష జనపరెడ్డి



**అల్లూరి జిల్లా, సిటిజన్ టైమ్స్, ఏప్రియల్ :15**

రోడ్డు ప్రమాదాలు రోజురోజుకూ పెరుగుతూ భయానక స్థాయికి చేరుతున్నాయి. ఇంటి నుంచి బయలుదేరిన వ్యక్తి సురక్షితంగా తిరిగి వస్తాడనే నమ్మకం కూడా తగ్గిపోతున్న పరిస్థితి నెలకొంది. అనేక మంది ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోతుండగా, మరికొందరు శాశ్వత అంగవైకల్యంతో బాధపడుతున్నారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం సుమారు 4.5 లక్షల రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా, అందులో 1.70 లక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరం. వాహనాల సంఖ్య పెరుగుతున్నప్పటికీ, రోడ్డు భద్రతపై అవగాహన మాత్రం తక్కువగానే ఉంది. రాంగ్ సైడ్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్, సిగ్నల్ జంపింగ్, అతివేగం, మద్యం సేవించి వాహనం నడపడం, హెల్మెట్ లేదా సీట్ బెల్ట్ వినియోగించకపోవడం వంటి నిర్లక్ష్యాలే ప్రమాదాలకు ప్రధాన కారణాలు అవుతున్నాయి. ప్రమాదం జరిగిన తర్వాత బాధపడటం కంటే, ముందుగానే జాగ్రత్తలు తీసుకోవడం అత్యంత అవసరం. ప్రస్తుతం పెరుగుతున్న "రికార్డింగ్ కల్చర్" కూడా ఆందోళనకరం. ప్రమాదంలో గాయపడిన వారికి సహాయం చేయాల్సింది పోయి, వీడియోలు తీసి సోషల్ మీడియాలో పోస్టు చేయడంపై కొందరు ఆసక్తి చూపుతున్నారు. గోల్డెన్ అవర్‌లో బాధితులను ఆసుపత్రికి చేర్చితే ప్రాణాలు నిలబెట్టే అవకాశం ఉంటుంది. వెంటనే 108కు సమాచారం ఇవ్వడం, అవసరమైతే సీపీఆర్ చేయడం ద్వారా ప్రాణాలను కాపాడవచ్చు. రోడ్డు భద్రతలో డిఫెన్సివ్ డ్రైవింగ్ కీలకం. అంటే, ఇతరుల తప్పిదాలను కూడా పరిగణలోకి తీసుకుని అప్రమత్తంగా వాహనం నడపడం. ట్రాఫిక్ నిబంధనలను భయంతో కాకుండా బాధ్యతతో పాటించడం ప్రతి ఒక్కరి కర్తవ్యంగా మారాలి. రోడ్ల వెంట ఉన్న హోటళ్లు, మెడికల్ షాపులు, పెట్రోల్ బంకుల సిబ్బంది 'ఫస్ట్ రెస్పాండర్స్'గా మారితే ప్రమాదాల్లో ప్రాణనష్టం తగ్గించవచ్చు. సాయం చేసిన వారిని గుడ్ సమరిటన్‌గా గుర్తించి సన్మానించడం సమాజంలో సానుకూల మార్పుకు దోహదపడుతుంది. సాంకేతికతతో పాటు ప్రజల భాగస్వామ్యం ఉంటేనే రోడ్డు భద్రత సాధ్యం. సోషల్ మీడియాను కూడా అవగాహన వేదికగా మార్చాలి. 'నో హెల్మెట్--నో ఎంట్రీ' వంటి కార్యక్రమాలు ప్రజా ఉద్యమాలుగా మారితే ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయి. చట్టాలు కఠినంగా ఉన్నా, పోలీస్ వ్యవస్థ కృషి చేసినా, ప్రజల సహకారం లేకుండా పూర్తి ఫలితం సాధ్యం కాదు. ప్రతి వాహనదారుడు చలానాల భయంతో కాదు, తన ప్రాణం కుటుంబానికి ఎంత విలువైనదో గుర్తించి బాధ్యతగా వ్యవహరించాలి. గమ్యాన్ని త్వరగా చేరుకోవడం కాదు. క్షేమంగా చేరుకోవడమే ప్రయాణానికి అసలైన సార్థకత. ఈ విషయాన్ని అందరూ గ్రహించి జాగ్రత్తగా ప్రయాణించాలని ఎస్ హెచ్ జె ఫౌండేషన్ ఫౌండర్ హర్ష జనపరెడ్డి సూచించారు.

## నాగర్‌కర్నూల్ జిల్లాలో విస్తృతంగా అగ్నిమాపక వారోత్సవాలు



**సిటిజన్ టైమ్స్ నాగర్‌కర్నూల్, ఏప్రిల్ 15**

అగ్నిమాపక సేవా వారోత్సవాల సందర్భంగా బుధవారం నాగర్‌కర్నూల్ జిల్లా వ్యాప్తంగా అగ్నిమాపక శాఖ అధికారులు విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. జిల్లా అగ్నిమాపక అధికారి గిరిధర్ రెడ్డి పర్యవేక్షణలో నాగర్‌కర్నూల్, కొల్లాపూర్, కల్వకుర్తి, అచ్చంపేట అగ్నిమాపక కేంద్రాల సిబ్బంది బస్టాండ్లు, మార్కెట్లు, ప్రధాన రహదారుల వద్ద ప్రజలకు అగ్ని ప్రమాదాలపై చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా అగ్నిప్రమాదాలకు దారితీసే నిర్లక్ష్యం, షార్ట్ సర్క్యూట్, గ్యాస్ లీకేజీల వంటి కారణాలను వివరించారు. ఇళ్లలో, వ్యాపార సంస్థల్లో తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలను తెలియజేశారు. అగ్ని ప్రమాదం సంభవించినప్పుడు భయపడకుండా సమయోచితంగా ఎలా స్పందించాలి, ముఖ్యంగా విద్యుత్ మంటలపై నీళ్లు పోయకూడదని హెచ్చరించారు. అదేవిధంగా ఫైర్ ఎక్స్‌టింగ్యుషర్ల వినియోగంపై ప్రత్యక్ష ప్రదర్శనలు నిర్వహించి, మంటలను ప్రారంభ దశలోనే అదుపు చేసే విధానాలను ప్రజలకు చూపించారు. ప్రమాదం జరిగిన వెంటనే 101కు సమాచారం అందించాలని సూచించారు. "ప్రజల అప్రమత్తతతోనే ప్రాణ, ఆస్తి నష్టాలను నివారించవచ్చు" అని అధికారులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ అగ్నిమాపక కేంద్రాల ఫైర్ ఆఫీసర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికుల భద్రతే మా ప్రాధాన్యత: పుష్ కార్టులు, రక్షణ పరికరాలు పంపిణీ చేసిన ఎమ్మెల్యే ఆనందరావు

### అమలాపురం పట్టణ అభివృద్ధి పారిశుద్ధ్యానికి పెద్దపీట: ఎమ్మెల్యే ఆనందరావు



**అమలాపురం సిటిజన్ టైమ్స్ ఏప్రిల్ 15**

పట్టణాన్ని పారిశుద్ధ్యంలో ఆదర్శంగా తీర్చిదిద్దడమే లక్ష్యమని స్థానిక శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. బుధవారం అమలాపురం మున్సిపల్ కార్యాలయం వద్ద జరిగిన పారిశుద్ధ్య పరికరాల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, పురపాలక సంఘ పరిధిలోని 1 నుండి 30 వార్డులలో పారిశుద్ధ్యాన్ని మరింత మెరుగుపరచడానికి సుమారు 10 లక్షల రూపాయల వ్యయంతో 50 పుష్ కార్టులను, 5 లక్షల రూపాయల వ్యయంతో 350 డస్ట్ బిన్నులను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. పారిశుద్ధ్య కార్మికుల భద్రతకు తాము అత్యంత ప్రాధాన్యత ఇస్తున్నామని, అందులో భాగంగా 3 లక్షల రూపాయల వ్యయంతో వారికి రేడియం జాకెట్లు, గ్లౌవ్స్ మరియు మాస్కులను అందజేసినట్లు వివరించారు. పట్టణంలో పర్యావరణ పరిరక్షణకు కృషి చేస్తున్న మహిళలను ప్రోత్సహించే దిశగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ సహకారంతో పలు కీలక చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే తెలిపారు. కిచెన్ గార్డెన్స్, టెర్రాస్ గార్డెన్స్ నిర్వహిస్తూ హోమ్ కంపోస్ట్ ద్వారా మొక్కలను పెంచుతున్న మహిళలకు 75 వేల రూపాయల విలువైన 62 కంపోస్ట్ బిన్నుల కిట్లను పంపిణీ చేశారు. అమలాపురం పట్టణాన్ని సుందరంగా ఆరోగ్యకరంగా ఉంచేందుకు ప్రజలందరూ భాగస్వాములు కావాలని, ప్రతి ఇంట్లోనూ తడి-పొడి చెత్తను వేరు చేసి మున్సిపల్ సిబ్బందికి అందించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ప్రజా ప్రతినిధులు,కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బ్లూ జీన్స్‌లో ఈషా గ్లామర్ టచ్.. నెట్టింట ట్రెండ్







తెలుగు చిత్ర పరిశ్రమలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న వరంగల్ చిన్నది ఈషా రెబ్బా, తాజాగా సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటోలతో నెటిజన్ల మనసు దోచుకుంటోంది. బ్లూ అండ్ బ్లూ జీన్స్ లుక్‌లో ఆమె కనిపిస్తున్న తీరు ఎంతో స్టైలిష్‌గా, అదే సమయంలో చాలా సింపుల్‌గా ఉంది. కస్సుమనే చూపులతో, డిఫరెంట్ స్టిల్స్‌లో ఈషా పంచుకున్న ఈ ఫోటోలు ప్రస్తుతం ఇన్‌స్టాగ్రామ్‌లో వైరల్ అవుతూ ట్రెండింగ్‌లో నిలిచాయి. సంప్రదాయ దుస్తుల్లోనే కాకుండా, ఇలాంటి వెస్ట్రన్ వేర్‌లో కూడా ఆమె గ్లామర్ అదిరిపోయిందని ఫ్యాన్స్ కామెంట్లతో ముంచెత్తుతున్నారు.

**డెనిమ్ లుక్‌లో ఈషా మెరుపులు:**

తాజా ఫోటో షూట్‌లో ఈషా రెబ్బా పూర్తి డెనిమ్ లుక్‌లో దర్శనమిచ్చింది. బ్లూ కలర్ జీన్స్ షర్ట్, దానికి తగ్గట్టుగా జీన్స్ ప్యాంటు ధరించి ఒక నేచురల్ లుక్‌ను సొంతం చేసుకుంది. ఫోటోలో ఆమె కింద కూర్చుని, ఒక చేత్తో ఎల్లో కలర్ 'మినియన్' మగ్‌ను పట్టుకుని, మరో చేతిని తలకు ఆనించి సీరియస్ లుక్ ఇస్తున్న తీరు చాలా ఆకర్షణీయంగా ఉంది. ఇక ఎలాంటి ఆడంబరాలు లేకుండా చాలా సింపుల్‌గా కనిపిస్తూనే, తన కళ్ళతో నెటిజన్లను మెస్మరైజ్ చేస్తోంది. ఈ 'డబుల్ డెనిమ్' ట్రెండ్ ఈషాకు పర్ఫెక్ట్‌గా సెట్ అయిందని చెప్పవచ్చు.

**తెలుగమ్మాయి ప్రయాణం.. సినిమాల సందడి:**

ఇక లైఫ్ ఈజ్ బ్యూటిఫుల్ సినిమాతో కెరీర్ మొదలుపెట్టిన ఈషా, అంతకు ముందు ఆ తర్వాత చిత్రంతో హీరోయిన్‌గా మంచి గుర్తింపు తెచ్చుకుంది. తెలుగమ్మాయి కావడంతో మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురైనా, తన నటనతో ఒక్కో మెట్టు ఎక్కుతూ వచ్చింది. అమీ తుమీ, బందిపోటు వంటి సినిమాల్లో తన కామెడీ టైమింగ్‌తో ఆకట్టుకుంది. ఇక నాని నిర్మించిన అ సినిమాతో పాటు, ఎన్టీఆర్-త్రివిక్రమ్ కాంబోలో వచ్చిన 'అరవింద సమేత'లో ఒక కీలక పాత్రలో నటించి స్టార్ హీరోల సినిమాల్లోనూ తన సత్తా చాటింది. ప్రస్తుతం ఆమె బాలీవుడ్ ఎంట్రీకి కూడా సిద్ధమవుతోంది.

**సోషల్ మీడియాలో భారీ ఫాలోయింగ్:**

ఈషా రెబ్బా సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటుంది. షూటింగ్ విశేషాలతో పాటు తన వ్యక్తిగత ఫోటోలను కూడా ఎప్పటికప్పుడు ఫ్యాన్స్‌తో పంచుకుంటుంది. హీరోయిన్‌గానే కాకుండా, సెకండ్ హీరోయిన్‌గా కూడా వైవిధ్యమైన పాత్రలు చేస్తూ విమర్శకుల ప్రశంసలు అందుకుంటోంది. ఇక రీసెంట్ గా 'మామా మశ్చీంద్ర', 'ఓం శాంతి శాంతి శాంతిః' వంటి మూవీ లతో అలరించిన ఈ భామ, కేవలం తెలుగుకే పరిమితం కాకుండా తమిళ్, మలయాళ భాషల్లో కూడా తన అదృష్టాన్ని పరీక్షించుకుంటోంది. అందుకే ఆమెకు దక్షిణాది అంతటా ఫాలోయింగ్ పెరుగుతోంది.

**స్టార్ ఇమేజ్ దిశగా అడుగులు:**

ప్రస్తుతం ఈషా రెబ్బా పంచుకున్న ఈ బ్లూ జీన్స్ పిక్స్ ఆమె గ్లామర్ రేంజ్‌ను మరోసారి చాటిచెప్పాయి. ఫోటోలో ఆమె కూర్చున్న భంగిమ, ఆ ఎల్లో మగ్ కాంబినేషన్ నెటిజన్లను విపరీతంగా ఆకర్షిస్తున్నాయి. చిన్న సినిమాల నుంచి మొదలై ఈరోజు పాన్ ఇండియా స్థాయికి ఎదిగేందుకు ఈషా చేస్తున్న ప్రయత్నాలు అభినందనీయం. గ్లామర్ ప్లస్ టాలెంట్ ఉన్న ఈ వరంగల్ బ్యూటీ, త్వరలోనే బాలీవుడ్ లోనూ జెండా పాతాలని అభిమానులు కోరుకుంటున్నారు. ఈషా ఇలాంటి మరిన్ని విభిన్నమైన ఫోటోషూట్‌లతో అభిమానులను అలరించాలని ఆశిద్దాం.

## భారత జట్టు నుంచి రోహిత్, కోహ్లీ ఔట్.. శత్రువులని కొని తెచ్చుకున్న గంభీర్..





టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ గురించి మాజీ పేసర్ మునాఫ్ పటేల్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు క్రికెట్ వర్గాల్లో హాట్ టాపిక్ గా మారాయి. గంభీర్‌ను కోచ్ పదవి నుంచి తొలగించవద్దని భారత క్రికెట్ నియంత్రణ మండలి ( ని హెచ్చరించాడు. అది ఏమాత్రం ఇండియన్ టీమ్ కి మంచిది కాదని పేర్కొన్నారు. ఎందుకంటే, రోహిత్ శర్మ- విరాట్ కోహ్లీ లాంటి స్టార్ ఆటగాళ్లకు మొహమాటం లేకుండా 'నో' చెప్పే ధైర్యం ఒక్క గంభీర్‌కే ఉందని మునాఫ్ పటేల్ అభిప్రాయపడ్డారు. గంభీర్ ఉన్నది ఉన్నట్లు మాట్లాడే వ్యక్తి, జట్టు ప్రయోజనాల కోసం కఠిన నిర్ణయాలు తీసుకోవడానికి ఆయన వెనుకాడరని మునాఫ్ పటేల్ వెల్లడించారు. జట్టులో క్రమశిక్షణను కాపాడటంలో గంభీర్ పాత్ర కీలకం, అతడ్ని తొలగిస్తే టీమ్ మేనేజ్‌మెంట్ కష్టమవుతుందని తెలిపారు. గౌతమ్ కోచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత భారత్ అద్భుతమైన విజయాలు సాధించిందని చెప్పుకొచ్చాడు. గంభీర్ సారథ్యంలో భారత్ ఛాంపియన్స్ ట్రోఫీ, ఆసియా కప్, టీ20 ప్రపంచ కప్ వంటి మూడు ప్రధాన టోర్నీలను కైవసం చేసుకుంది. పరిమిత ఓవర్ల క్రికెట్‌లో అద్భుతంగా రాణించినప్పటికీ, టెస్ట్ క్రికెట్‌లో జట్టు ఆశించిన స్థాయిలో ఫలితాలు రాలేకపోతున్నాయి పేర్కొన్నాడు. ప్రస్తుతం మునాఫ్ పటేల్ ఐపీఎల్ 2026 సీజన్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ జట్టుకు బౌలింగ్ కోచ్‌గా సేవలు అందిస్తున్నారు. ఇప్పటివరకు ఆడిన 4 మ్యాచ్‌ల్లో 2 విజయాలతో, 4 పాయింట్లతో పాయింట్ల పట్టికలో 5వ స్థానంలో ఢిల్లీ కొనసాగుతోంది. ఒకవైపు గంభీర్ కోచింగ్ శైలిపై చర్చ జరుగుతుంటే, మరోవైపు మునాఫ్ పటేల్ లాంటి మాజీ ఆటగాళ్లు అతడికి అండగా నిలవడం ఆసక్తికరంగా మారింది.

## రోహిత్ శర్మ గాయంపై బిగ్ అప్‌డేట్.. ముంబై ఫ్యాన్స్ ఫుల్ ఖుషీ




ముంబై ఇండియన్స్ జట్టు ఫ్యాన్స్ కి గుడ్ న్యూస్. రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుతో జరిగిన మ్యాచులో టార్గెట్ ఛేదనలో ముంబై ఓపెనర్ రోహిత్ శర్మ గాయం కారణంగా రిటైర్డ్ హర్ట్ గా మైదానం వీడాడు. దీంతో 241 రన్స్ ఛేదనలో ముంబై కేవలం 222 పరుగులకే పరిమితమైంది. అప్పటికి రోహిత్ 13 బంతుల్లో 19 రన్స్ చేశాడు. ఈ క్రమంలో రోహిత్ గాయంపై సర్వత్రా టెన్షన్ నెలకొంది. కానీ, అతడికి సంబంధించి మెడికల్ రిపోర్ట్ వచ్చింది. కండరాలు పట్టేయడంతో స్టేడియం వీడిన అతడు.. స్కానింగ్ తీయించుకున్నాడు. మెడికల్ రిపోర్ట్ ప్రకారం ఎలాంటి చీలిక లేదని తేలిపోయింది. దీంతో ముంబై ఇండియన్స్ అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. పంజాబ్ కింగ్స్ జట్టుతో గురువారం (026, ఏప్రిల్ 16న) మ్యాచ్లో ఆడతాడో? లేదో అనేది ఇంకా గందరగోళంగానే ఉంది. గాయం మరీ పెద్దది కాకపోవడంతో ఫస్ట్ అనుకున్నట్లు మరిన్ని మ్యాచులకు మాత్రం దూరమయ్యే ఛాన్స్ లేదు. ఇవాళ సాయంత్రానికి రోహిత్ శర్మ ఫిట్ నెస్ పై క్లారిటీ వచ్చే అవకాశం ఉంది. ప్రస్తుతం అద్భుతమైన ఫామ్ లో ఉన్న రోహిత్ సేవలు జట్టుకి ఎంతో అవసరం. కనీసం అతడిని ఇంపాక్ట్ ప్లేయర్ గానైనా బరిలోకి దింపే అవకాశం ఉంటుందని ఐపీఎల్ వర్గాలు పేర్కొంటున్నాయి. ఐపీఎల్లో ఒక ఫ్రాంచైజీ తరపున 6వేల రన్స్ చేసిన బ్యాటర్ గా హిట్ మ్యాన్ నిలిచాడు. ఈ సీజన్లో ముంబై నాలుగు మ్యాచుల్లో ఒకేఒక్క విజయం సాధించింది. ప్లేఆఫ్స్ కి చేరుకోవాలంటే ఇక నుంచి ప్రతి మ్యాచ్ గెలవాల్సిన పరిస్థితి నెలకొంది. మరోవైపు బ్యాటింగ్ లో ఫర్వాలేదనిపిస్తోన్న ఎంఐ.. బౌలింగ్ మాత్రం తేలిపోతోంది. స్టార్ పేసర్లు బుమ్రా, బౌల్ట్ ప్రభావం చూపించలేక, ఘోరంగా విఫలమవుతున్నారు.

## లక్నో ఐం ఆర్సీబీ మధ్య హై వోల్టేజ్ ఫైట్.. విన్నర్ మాత్రం ఆ జట్టే!



మ్యాచ్‌లో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు వర్సెస్ లక్నో సూపర్ జయంట్స్ జట్లు కాసేపట్లో (2026, ఏప్రిల్ 15న) పోటీ పడబోతున్నాయి. గత మ్యాచ్‌లో ముంబైపై సాధించిన విజయంతో ఆర్సీబీ పూర్తి ఆత్మవిశ్వాసంతో ఉండగా, లక్నో గత మ్యాచ్‌లో గుజరాత్ చేతిలో ఓటమిని ఎదుర్కొని ఈ మ్యాచ్‌కు సిద్ధమవుతోంది. కాగా ఈరోజు జరిగే మ్యాచ్‌లో విరాట్ కోహ్లీ అత్యధిక పరుగులు చేసే అవకాశం కనిపిస్తుంది. తన సొంత గడ్డ (చిన్నస్వామి స్టేడియం)పై ఈ సీజన్‌లో ఆడిన రెండు మ్యాచ్‌ల్లో కోహ్లీ ఇప్పటికే 97 పరుగులు సాధించి మంచి ఫామ్‌లో ఉన్నాడు.

**విజేత ఎవరంటే?:**

ప్రస్తుత ఫామ్, హోమ్ గ్రౌండ్ అడ్వాంటేజ్‌ను బట్టి చూస్తే రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (=జదీ) టీమ్ ఈ మ్యాచ్‌లో హాట్ ఫేవరెట్‌గా కనిపిస్తోంది. గూగుల్ స్పోర్ట్స్ డేటా ప్రకారం.. ఆర్సీబీ గెలిచే అవకాశం 62.3 శాతం ఉండగా, లక్నో సూపర్ జెయింట్స్ గెలిచే అవకాశం 37.7 శాతం మాత్రమే ఉందని తెలిపింది.

**పిచ్ రిపోర్ట్:**

బెంగళూరులోని చిన్నస్వామి స్టేడియం ఎప్పుడూ బ్యాటర్లకు స్వర్గధామంగా ఉంటుంది. చిన్న బౌండరీలు, ఫ్లాట్ వికెట్ వల్ల ఇక్కడ పరుగుల వరద పారడం ఖాయం. ఆర్సీబీ గతంలో ఇక్కడ 250ం పరుగులు కూడా సాధించింది, కాబట్టి ఈరోజు కూడా భారీ స్కోర్లు నమోదు అయ్యే అవకాశం ఉంది.

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు: ఫిల్ సాల్ట్, విరాట్ కోహ్లీ, దేవదత్ పడిక్కల్, రజత్ పాటిదార్, టిమ్ డేవిడ్, జితేష్ శర్మ, రొమారియో షెపర్డ్, కృనాల్ పాండ్యా, భువనేశ్వర్ కుమార్, రసిక్ సలామ్, జోష్ హాజిల్‌వుడ్.

ఇంపాక్ట్ ప్లేయర్: సుయాష్ శర్మ

లక్నో సూపర్ జయంట్స్: ఐడెన్ మార్క్రామ్, మిచెల్ మార్ష్, రిషబ్ పంత్, ఆయుష్ బదోని, నికోలస్ పూరన్, అబ్దుల్ సమద్, ముకుల్ చౌదరి, జార్జ్ లిండే/అన్రిచ్ నోర్ట్జే, మహమ్మద్ షమీ, అవేష్ ఖాన్, దిగ్వేష్ సింగ్ రాఠీ.

ఇంపాక్ట్ ప్లేయర్: ప్రిన్స్ యాదవ్

Printed, published,and owned by kancherla Sandeep kumar. Published at Door. No. 19-57, Deendayalpuram, mudasarlova, Visakhapatanam, Andrapradesh 530040.
Printed at Sri Sai Ganga printer's and publications flat no. 504,Bharat towers, 5th lane, Dwarakanagar, Visakhapatanam,Andrapradesh 530016.
Editor. Kancherla Sandeep Kumar. RNI No. APTEL /2009/28868.PHONE No. 9966447776